
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

శనివారం 11 అక్టోబరు 2025

## ట్రేడింగ్‌లో నష్టపోయి సొంతింటికే కన్నం

- స్నేహితుల సాయంతో దొంగతనం
- నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు
- రెడ్డి కంచరపాలెం కేసులో దోపిడీకి సూత్రధారి మనుమడే..

- మెయిన్ 13లో



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి. చిత్రంలో నిందితులు (ముసుగు ఉన్నవారు) ఉన్నారు.

## మంత్రి లోకేశ్ రాక రేపు

- కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి ప్రారంభం
- సిఫీ టెక్నాలజీస్‌కు శంకుస్థాపన
- పీఎం పాలెంలో క్రికెట్ మ్యాచ్ వీక్షణం



విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదివారం విశాఖపట్నం ... మిగతా 6వ పేజీలో

## పెట్టుబడుల వెల్లువ

### తర్లువాడ, అడవివరంలో 'రైడెన్'

- రూ.87,250 కోట్లతో డేటా సెంటర్‌ల ఏర్పాటు
- కాపులుప్పాడలో ఇమాజినేటివ్ టెక్ సొల్యూషన్స్
- గుర్రంపాలెంలో అవంతి లాజిస్టిక్స్ పార్క్
- స్టీల్‌ప్లాంటుకు రూ.2,400 కోట్ల మేర సాయం

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):

**విశాఖపట్నానికి పెట్టుబడులు పోటెత్తాయి. విజయవాడలో శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో వీటికి ఆమోదం లభించింది. అందులో కీలకమైన ప్రాజెక్టులు ఉన్నాయి. కాపులుప్పాడ సర్వే నంబరు 401లో ఇమాజినేటివ్ టెక్ సొల్యూషన్స్ (ఇండియా)కు ఎకరా రూ.2 కోట్లు చొప్పున 4.05 ఎకరాలు కేటాయించారు. వారు రూ.140 కోట్లు పెట్టుబడి పెట్టి 2,600 మందికి ఉపాధి కల్పిస్తారు.**

- రైడెన్ ఇన్ఫోటెక్ సంస్థకు తర్లువాడ, అడవివరం, రాంబిల్లిలో మొత్తం 480 ఎకరాలు కేటాయించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పవర్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తారు. వీరు రూ.87,250 కోట్లు పెట్టుబడి పెట్టి 200 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పిస్తారు. పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి.
- పరవాడ ఫార్మాసిటీలో ఎంఎస్ఆర్ ఫార్మా కంపెనీ 22.18 ఎకరాల్లో రూ.160 కోట్లు పెట్టుబడి పెట్టి 198 మందికి ఉద్యోగాలు ఇస్తుంది.
- పెందుర్తి సమీపాన గుర్రంపాలెంలో అవంతి వేర్ హౌసింగ్ సంస్థకు ఇండస్ట్రియల్ లాజిస్టిక్స్ పార్క్‌కు 20 ఎకరాలు కేటాయించారు. ఎకరాకు రూ.80 లక్షలు ధర నిర్ణయించారు. మొత్తం రూ.319 కోట్లు పెట్టుబడి పెడతారు.
- బీచ్‌రోడ్డులో లులు మాల్‌కు కేటాయించిన 13.74 ఎకరాల్లో రూ.1,066 కోట్లు పెట్టుబడి పెట్టి 500 మందికి ఉద్యోగాలు ఇస్తుంది. వీరికి ఏడాదికి రూ.7.08 కోట్లు లీజు నిర్ణయించారు.
- అరకులోయలో వీఎస్‌కే హోటల్ ... మిగతా 6వ పేజీలో




## ప్రత్యామ్నాయం... దైవాధీనం!

### వివిధ అవసరాలకు సింహాచలేశుడి భూములు

- 1972లో ఎన్ఎస్‌టీఎల్‌తో మొదలు...
- తాజాగా రైడెన్‌కు 100 ఎకరాలు
- ఇప్పటివరకూ 385 ఎకరాలు కేటాయింపు
- ప్రత్యామ్నాయ భూముల సాధనలో దేవదాయ శాఖ విఫలం
- అధికారుల నిర్లక్ష్యమే కారణమని భక్తుల ఆరోపణ

సింహాచలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):

**సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం మనుగడకు, స్వామివారి ధూప దీపాలకు దాతలు ఉదారంగా ఇచ్చిన భూములు కాలక్రమేణా తరిగిపోతున్నాయి. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ పరిసర ప్రాంతాల్లోనే ఈ భూములు ఉండడంతో తప్పనిసరి పరిస్థితిలో ప్రభుత్వాలు వివిధ సంస్థలకు కేటాయిస్తున్నాయి. అయితే అందుకు ప్రతిగా ప్రత్యామ్నాయ భూములు అందిస్తామని హామీ ఇస్తున్నాయి. కాగా ప్రత్యామ్నాయ భూములను దేవస్థానానికి బదిలీ చేయించడంలో దేవదాయ శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా దేవుని మాన్యం తరిగిపోతోంది.**



సింహాచలం దేవస్థానం

విశాఖ పరిసరాల్లో ప్రభుత్వాలు చేపట్టదలచిన పలు నిర్మాణాలకు సింహాచలం దేవస్థానానికి చెందిన భూములను తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ ఇప్పటిది కాదు. 1972 నుంచే ప్రారంభమైంది. అప్పట్లో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఎస్‌టీఎల్‌కు సుమారు 38 ఎకరాలను కేటాయించారు. తాజాగా రైడెన్ డేటా సెంటర్‌కు సుమారు 100 ఎకరాలు కేటాయించనున్నారు. ఇప్పటివరకూ సుమారు 385 ఎకరాల దేవస్థానం భూమిని వివిధ సంస్థలకు కేటాయించారు.

#### ఇవీ నిబంధనలు

నిబంధనలను అనుసరించి దేవస్థానం భూములు కేటాయించాలంటే మార్కెట్ ధర చెల్లించాలి. లేదా బహిరంగ వేలం ద్వారా విక్రయించాలి. అదీకాకుంటే తీసుకున్న కమతానికి సరిపడా ప్రత్యామ్నాయ భూమిని తిరిగి దేవస్థానానికి బదలాయించాలి. అయితే ఈ నిబంధనల మేరకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ భూములు ఇస్తామని ప్రకటిస్తున్నా, వాటిని తీసుకోవడంలో దేవదాయ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. ఐదు దశాబ్దాలుగా పలు ప్రభుత్వ సంస్థలకు ... మిగతా 6వ పేజీలో

## కొత్త ఉపాధ్యాయులకు పాఠశాలలు కేటాయింపు



కొత్తగా నియమితులైన టీచర్లతో డీఈవో ప్రేమ్‌కుమార్, ఇతర అధికారులు

- ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్స్
- ఇతర కేటగిరీ అభ్యర్థులకు ఆన్‌లైన్ విధానంలో...
- 13వ తేదీ నుంచి పాఠశాలలకు టీచర్లు

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులు ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 234 మందికి సబ్బవరం, పెందుర్తిల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకూ విశాఖపట్నం డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి ఏజెన్సీ, మైదానంలోని ప్రాథమిక పాఠశాలల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. ఎక్కువగా ఏజెన్సీలో ఖాళీలను భర్తీచేశారు. అలాగే స్కూల్ అసిస్టెంట్/తత్సమాన కేటగిరీలో 495 ఖాళీలకు అభ్యర్థులు గురువారం వెబ్‌ఆప్షన్స్ ఇవ్వగా, వారికి శుక్రవారం ... మిగతా 6వ పేజీలో

## రౌడీషీటర్ హత్య

### స్వస్థలం విజయవాడ... హంతకుడు విశాఖ వాసి

- ఆలస్యంగా వెలుగుచూసిన ఉదంతం
- అనకాపల్లి జిల్లా పోలవరం కాలువ వద్ద మృతదేహం గుర్తింపు
- నాలుగు రోజుల క్రితం ఇద్దరూ కలిసి కోర్టుకు హాజరు
- అనంతరం మహిళ విషయమై గొడవ
- ఈ క్రమంలోనే విజయవాడ వాసిపై కత్తితో దాడి



హత్యకు గురైన రౌడీషీటర్ శ్రీధర్‌బాబు (ఫైల్ ఫొటో)

ఎలమంచిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):

**ఇద్దరు రౌడీషీటర్ల మధ్య తలెత్తిన వివాదం అనుకోకుండా ఒకరి మృతికి దారితీసింది. ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఇందుకు సంబంధించి విశాఖపట్నంలోని ఎంవీపీ స్టేషన్ సీఐ ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.**

విశాఖ నగరానికి చెందిన ఎన్.గౌరీశంకర్‌పై రౌడ్ షీట్ ఉంది. దీంతో పోలీసులు కొంతకాలం క్రితం నగర బహిష్కరణ చేయడంతో ఎలమంచిలి వచ్చి ఉంటున్నాడు. అతనికి గతంలో విజయవాడ సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్ఆర్ పేటకు చెందిన పాత నేరస్థుడు కొంకోట శ్రీధర్‌బాబు(35)తో పరిచయం ఏర్పడింది. ఒక చోరీ కేసులో వీరు నిందితులుగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి కోర్టుకు హాజరుకావడానికి ఈ నెల 7వ తేదీన ఇద్దరూ కలిసి కారులో విశాఖ వెళ్లారు. కేసు వాయిదా అనంతరం సీతమ్మధార రైతుబజార్ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ మద్యం సేవించిన తరువాత ఒక మహిళ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో గౌరీశంకర్ తన వద్ద ఉన్న కత్తితో శ్రీధర్‌బాబు చేతిపై తీవ్రంగా గాయపరిచాడు. రక్తస్రావం అవుతుండడంతో ఇద్దరూ కలిసి కారులో సమీపంలోని ఆస్పత్రికి వెళ్లారు. శ్రీధర్‌బాబు గాయానికి కుట్లు వేసిన తరువాత ఇద్దరూ కలిసి కారులో ఎలమంచిలి వైపు బయలుదేరారు. అయితే ఎనిమిదో తేదీ తెల్లవారుజామున దారిలోనే శ్రీధర్‌బాబు మృతిచెందాడు. దీంతో గౌరీశకంర్ కారును అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మునిసిపాలిటీలోని మర్రిబంద సమీపంలోని పోలవరం కాలువ వద్దకు తీసుకువెళ్లి, శ్రీధర్‌బాబు మృతదేహాన్ని అక్కడ పడేశాడు. ఇదిలావుండగా విశాఖ ఎంవీపీ పోలీసులు మరో కేసు విషయమై గౌరీశంకర్‌ను తొమ్మిదో తేదీన అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తుండగా... శ్రీధర్‌బాబు మృతి విషయం బయటపడింది. దీనిపై ... మిగతా 6వ పేజీలో

## 13, 14 తేదీల్లో పలు రైళ్లు రద్దు

- మరికొన్నింటి గమ్యాల కుదింపు
- 'ప్రశాంతి' ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):

శ్రీకాకుళం జిల్లా పూండి స్టేషన్ వద్ద ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో పలు రైళ్లను రద్దు చేశామని, మరికొన్నింటి గమ్యాలు కుదించామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

**రద్దైన రైళ్లు:** ఈ నెల 13న విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ (18526), విశాఖ-భువనేశ్వర్ ఇంటర్‌సిటీ (22820), విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ (58532), 14న బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18525), భువనేశ్వర్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (22819), విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ (58531)

**గమ్యాల కుదింపు:** విశాఖ-పలాస మధ్య రాకపోకలు సాగించే 67289, 67290 నంబరు గల రైళ్లు ఈ నెల 13న విశాఖ-శ్రీకాకుళం మధ్య రాకపోకలు సాగిస్తాయి. అలాగే ఖుర్దా డివిజన్‌లో భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్నందున విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ రైలు (58532) వచ్చే నెల 11 వరకూ ప్రతి సోమ, మంగళ, శనివారాల్లో విశాఖ నుంచి పలాస వరకు, తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్-విశాఖ పాసింజర్ (58531) రైలు ప్రతి మంగళ, బుధ, శనివారాల్లో పలాస నుంచి విశాఖ వరకూ నడుస్తుంది.

బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464) వచ్చే నెల 11 వరకు ఒరిజినేటింగ్ స్టేషన్ నుంచి రెండున్నర గంటలు ఆలస్యంగా బయలుదేరనుంది. మధ్యాహ్నం 1.40 గంటలకు బయలుదేరాల్సిన ఈ రైలు సాయంత్రం 4.10 గంటలకు బయలుదేరుతుందని డీసీఎం పేర్కొన్నారు.

## కారుణ్య నియామకాలకు కలెక్షన్

### జీవీఎంసీలో ఒక అధికారి సూత్రధారి

- ఉద్యోగార్థులతో 'సీ' సెక్షన్ ఉద్యోగి బేరసారాలు
- అడిగినంత ఇస్తే జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం
- ఇవ్వకపోతే క్లాస్-4 ఉద్యోగమేనని బెదిరింపు
- ఒక్కొక్కరి వద్ద రూ.50 వేలు నుంచి రూ.1.5 లక్షలు వసూలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**జీవీఎంసీలో కారుణ్య నియామకాల పేరుతో ఒక అధికారి వసూళ్ల పర్వానికి దిగారు. తన అనుచరుడైన 'సీ' సెక్షన్‌లోని ఒక ఉద్యోగి ద్వారా ఉద్యోగార్థులతో బేరసారాలు జరిపారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రూప్-3 కేటగిరీ ఉద్యోగానికి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ సదరు అధికారికి అడిగినంత ఇవ్వాల్సిందేనని...కాదంటే గ్రూప్-4లో ఉద్యోగాలే వస్తాయని బెదిరించారని బాధితులు చెబుతున్నారు. వసూళ్ల తంతు పూర్తయిన తర్వాతే జాబితాను కమిషనర్‌కు పంపించాలని ఆ అధికారి నిర్ణయించినట్టు సమాచారం.**

జీవీఎంసీలో శాశ్వత ఉద్యోగి ఎవరైనా సర్వీస్‌లో ఉండగా మరణిస్తే వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తారు. మరణించిన ఉద్యోగి సంపాదనే ఆ కుటుంబానికి జీవనాధారమై ఉండి, కారుణ్య నియామకం కింద దరఖాస్తు చేసే వ్యక్తికి మరెలాంటి సంపాదన లేనప్పుడు అధికారులు అవకాశం కల్పిస్తారు. గత పది నెలలుగా కారుణ్య నియామకాలను అధికారులు నిలిపివేశారు. దీంతో ప్రస్తుతం సుమారు 30 మంది కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నారు. కారుణ్య నియామకం కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థి కనీసం డిగ్రీ పాసై ఉంటే జూనియర్ అసిస్టెంట్, డిప్లమో, ఇంజనీరింగ్ వంటి టెక్నికల్ అర్హతలు కలిగి ఉంటే వర్క్ ఇన్‌స్పెక్టర్, పదో తరగతి చదువుకుని ఉంటే రికార్డు అసిస్టెంట్, మజ్దూర్, అటెండర్ వంటి ఉద్యోగాలు కల్పిస్తారు. అయితే కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇస్తే తనకేమి లాభమని జీవీఎంసీలో కీలక అధికారి ఒకరు తనకు అత్యంత నమ్మకస్తుడైన 'సీ' సెక్షన్‌లోని ఉద్యోగి వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. ఇదే అదనుగా సదరు ఉద్యోగి కారుణ్య కోటాలో ఉద్యోగాలు పొందబోయే వారికి ఫోన్ చేసి బేరసారాలు ప్రారంభించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రూప్-3 పోస్టు అయిన జూనియర్ అసిస్టెంట్‌కు మంచి డిమాండ్ ... మిగతా 6వ పేజీలో

## ముమ్మర ప్రాక్టీస్



ఆస్ట్రేలియా క్రీడాకారిణి బౌలింగ్

మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో భాగంగా ఆదివారం భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇరు జట్ల ఆటగాళ్లు ముమ్మర సాధన చేశారు.

- వివరాలు 8లో



స్మృతి మంధాన బ్యాటింగ్ ప్రాక్టీస్

## 2047 నాటికి 50 శాతం పచ్చదనం

- విశాఖ సర్కిల్‌లో నాలుగు నగర వనాలు
- ఎకో టూరిజానికి ప్రోత్సాహం
- పర్యాటక ప్రాంతాల్లో అవసరమైన వసతులు కల్పిస్తాం
- అటవీ శాఖ విశాఖ సర్కిల్ కన్జర్వేటర్ దివాన్ మైదీన్



అటవీ శాఖ విశాఖ సర్కిల్ కన్జర్వేటర్ దివాన్ మైదీన్

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):

వికసిత్ భారత్‌లో భాగంగా విశాఖ సర్కిల్‌లో పచ్చదనాన్ని 50 శాతానికి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు అటవీ శాఖ కన్జర్వేటర్ బీఎం దివాన్ మైదీన్ చెప్పారు. ఆయన శుక్రవారం తన ఛాంబర్‌లో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ విశాఖ సర్కిల్ మొత్తం విస్తీర్ణం 23,547 చ.కి.మీ. కాగా 6,574.18 చ.కి.మీ.మేర అడవులు ఉన్నాయన్నారు. అడవులు కాకుండా బయట పచ్చదనం 1650 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉందన్నారు. మొత్తం 8,224.18 చ.కి.మీ (34.92 శాతం) పచ్చదనం ఉందన్నారు. దీనిని 2047కల్లా 11,700 చ.కి.మీ.కు పెంచనున్నామన్నారు. వచ్చే ఏడాది నుంచి భారీగా పచ్చదనం పెంపునకు నిర్ణయించామన్నారు. ఉత్తరాంధ్రలో కొత్తగా ఎలమంచిలి, నర్సీపట్నం, పాతపట్నం, పాలకొండల్లో నగరవనాలు ఏర్పాటుచేయనున్నామని వెల్లడించారు. పాలకొండలో పది హెక్టార్లలో నగరవనం అభివృద్ధికి రూ.40 లక్షలు, మిగిలిన మూడుచోట్ల 50 హెక్టార్లలో వనాల అభివృద్ధికి రూ.1.5 కోట్లు వంతున ఖర్చు ... మిగతా 6వ పేజీలో

## అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం



సింహాచలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవరులను శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

## చిప్పాడలో కనకమ్మ తల్లి దేవర ఉత్సవం



పూల అలంకరణలో అమ్మవారు

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : చిప్పాడ గ్రామంలో కనకమ్మ తల్లి దేవర ఉత్సవం ఘనంగా జరిగింది. గురువారం అర్ధరాత్రి దివిటీ సంబరంతో ఈ ఉత్సవం ప్రారంభమైంది. గ్రామస్తులు దివిటీలు వెలిగించి ఊరేగింపు జరిపారు.తెల్లవారుజాము వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున ఊరి పొలిమేరలో సంబరం జరిపి, అమ్మవారిని పలు రకాల పూలతో అలంకరించి హారతి ఇచ్చారు. చిప్పాడ, ఎరుసుపేట, కొత్తవూరు, అన్నవరం, నాగమయ్యపాలెం గ్రామాల భక్తులు తరలివచ్చి అమ్మవారికి కానుకలు సమర్పించారు.

## తర్లువాడలో రైతుల ధర్నా




తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ఆనందపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : తర్లువాడ గ్రామానికి చెందిన దళిత రైతులు తమ భూములను గూగుల్ డేటా సెంటర్‌కు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ రైతుల భూములను బలవంతంగా లాక్కోవాలని చూడడం ప్రభుత్వానికి తగదన్నారు. భూములపై ఆధారపడి దశాబ్దాలుగా 48 దళిత కుటుంబాలు జీవిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వానికి మరోచోట భూములున్నప్పటికీ రైతుల సాగు భూములే కావాలా అని ప్రశ్నించారు. అనంతరం తహశీల్దార్ శ్రీనుబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం భీమిలి జోన్ సహాయ కార్యదర్శి ఎస్. అప్పలనాయుడు, సీఐటీయూ మండల అధ్యక్షుడు నేలత్ రాము, నాయకులు పోతరాజు నరసింగరావు, గణేశ్, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం




మాట్లాడుతున్న జేఎన్‌టీయూ ప్రొఫెసర్ చంద్రభూషణరావు

ఆనందపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : శొంఠ్యాం సమీపంలో ఉన్న ఎన్ఎస్ఆర్ ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవ్ ('టెక్నిమ్బుల్ 2025') శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా విజయనగరం జేఎన్‌టీయూ అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ ఎస్. చంద్రభూషణరావు మాట్లాడుతూ సాంకేతిక ఉత్సవ్ విద్యార్థుల్లోని ప్రతిభ, నైపుణ్యం, సృజనాత్మక ఆలోచనలను వెలికితీసే వేదిక అన్నారు. ఉత్సవ్‌లో భాగంగా పోస్టర్, పేపర్ ప్రెజెంటేషన్లు, టెక్నికల్ హంట్, డ్రోన్ ఎక్స్‌పో, ఫిల్మ్ మేకింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి అనేక సాంకేతిక పోటీలు, ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ శంభుప్రసాద్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవ్‌కు రాష్ట్రంలోని పలు కళాశాలల నుంచి 1200 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజ్‌మెంట్ అధికారి డాక్టర్ పీఎస్ రాజు, ట్రెజరర్ ఎన్. కనకరాజు, కన్వీనర్ డాక్టర్ కె. శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై డెబ్రిస్‌తో అవస్థలు



రోడ్డుపై వేసిన మట్టి

సింహాచలం,అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని శిడగం వీధిలో కొందరు వ్యక్తులు రెండు రోజులుగా రోడ్డుపై డెబ్రిస్ వేస్తున్నారు. దీంతో రోడ్డు ఇరుగ్గా మారి వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసినా.. సచివాలయం సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

## మలేషియాలో అయ్యప్ప సదస్సుకు తాతినాయుడుకు ఆహ్వానం

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) :మలేషియాలో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు జరిగే అయ్యప్ప సేవా సదస్సు పడి పూజా కార్యక్రమాలకు లక్ష్మీపురం గ్రామానికి చెందిన గాడు తాతినాయుడుకు ఆహ్వానం అందింది.ఆయన అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ కార్యదర్శిగా ఉన్నారు. ఈమేరకు మలేషియాలోని అయ్యప్పస్వామి దేవస్థానం అధ్యక్షుడు ఉజ్వల కుప్పస్వామి నుంచి ఆహ్వానం అందింది.సదస్సులో అయ్యప్పస్వామి చరిత్ర, సంస్కృతి, ఆచార వ్యవహారాలపై చర్చ జరగనుంది.

## మంత్రి లోకేశ్ రాక రేపు

... 5వ పేజీ తరువాయి

వస్తున్నారు. మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో భాగంగా పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే మ్యాచ్‌ను తిలకిస్తారు. అదేరోజు కైలాసగిరిపై వీఎంఆర్‌డీఏ నిర్మించిన గ్లాస్ బ్రిడ్జిని ప్రారంభిస్తారు. ప్రముఖ ఐటీ సంస్థ సిఫీ టెక్నాలజీస్‌కు ఓజోన్‌వేలీలో కేటాయించిన స్థలంలో భూమి పూజ చేస్తారని తెలిసింది. వీటితో మరిన్ని కార్యక్రమాలు ఉన్నాయని, ఖరారు కావలసి ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

# తగరపువలసలో ట్రాఫిక్ కష్టాలు

- అత్యంత రద్దీగా ప్రధాన రహదారి
- ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులకు నరకయాతన
- ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలతో ఇబ్బందులు
- రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం ఫలితం



ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌పై చేస్తున్న వ్యాపారాలు

తగరపువలస, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస ప్రధాన రహదారిలో నిత్యం ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో విపరీతమైన రద్దీ నెలకొంటోంది. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు, ఆటోలను ఇష్టానుసారం నిలుపుదల చేస్తుండడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. రోడ్డు కూడా ఆక్రమణల వల్ల ఇరుగ్గా తయారైంది. అంబేడ్కర్ కూడలి నుంచి విజయనగరం వెళ్లే రూటులో, విశాఖపట్నం రూటులో వైఎస్ఆర్ కూడలి వరకు ఉన్న ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటున్నాయి. 20 ఏళ్ల క్రితం అప్పటి పరిస్థితుల దృష్ట్యా వీటిని విస్తరించారు. ఆ తరువాత నుంచి పట్టించుకోలేదు. ప్రధాన రహదారిలో పెద్ద షాపులతో పాటు కూరగాయలు, ఫ్యాన్సీ, చెప్పుల దుకాణాలు, తోపుడు బండ్లు ఉన్నాయి. అంబేడ్కర్ కూడలి నుంచి సంత వరకు రెండు లైన్ల రహదారి ఉన్నప్పటికీ పాదచారులు నడవడానికి కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈరూటులోనే సిటీ బస్సులు, ఆటోలు ప్రయాణిస్తుంటాయి. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలను నిరోధించాలని గత కొంతకాలంగా స్థానికులు కోరుతున్నా..పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. సాయంత్రం 4 నుంచి రాత్రి 10 వరకు లైట్లు వేసుకుని వ్యాపారాలు చేసేవారు ఎక్కువైపోయారు.ఎక్కడైనా ప్రధాన దుకాణం ముందు వేరే చిన్న దుకాణం పెడితే అభ్యంతరం వ్యక్తం చేస్తారు. కానీ ఇక్కడ ప్రతి దుకాణం ముందు మరో చిన్నదుకాణం ఉంది. చిన్న దుకాణదారులు పెద్ద దుకాణదారులకు అనధికారికంగా అద్దె చెల్లిస్తున్నట్టు తెలిసింది. భీమిలి నుంచి తగరపువలస వెళ్లే రహదారిలో పాత ఆంధ్రాబ్యాంకు కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు రహదారి విస్తరణ చేపట్టడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు దుకాణదారులకు నోటీసులు కూడా జారీ చేశారు. ఇటీవల ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద డ్రైనేజీలను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను అధికారులు తొలగించారు. కానీ ప్రధాన రహదారిలో ఉన్న వాటిని మాత్రం తొలగించడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### చాలా ఇబ్బంది పడుతున్నాం



మెయిన్ రోడ్డు ఇరుగ్గా ఉండడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో అటువైపు వెళ్లాలంటేనే భయపడుతున్నాం. ఆటోలు, సిటీ బస్సులు నిలపడానికి కూడా అవకాశం లేదు. ఆదివారం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.

జె. అప్పలనాయుడు, గొల్లవీధి

### చిరు వ్యాపారులకు నష్టం



ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు ఎక్కువ కావడంతో ప్రధాన రహదారి ఇరుగ్గా తయారైంది. పెద్ద దుకాణాల ముందు చిరు వ్యాపారులు అమ్మకాలు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి కూరగాయలు, పండ్లు తీసుకువచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు.

రామాయమ్మ, కూరగాయల వ్యాపారి, రాయినిపేట

## మాజీ ఎమ్మెల్యే పోతరాజుకు నివాళి

కొమ్మాది, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే తమ్మిన పోతరాజు 113వ జయంతి మధురవాడ సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. నగరాల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పోతరాజు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యేగా పోతరాజు కార్మికుల హక్కుల కోసం చేసిన పోరాటాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నగరాల సంఘం జిల్లా కార్యదర్శి జగ్గుపల్లి అప్పలరాజు, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ నాగోతి సూర్యప్రకాశరావు, వాండ్రాసి అప్పలరాజు, మురుపిళ్ల పైడిరాజు, పోతిన ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఔషధాల తయారీలో నాణ్యత పాటించాలి

సాగర్‌నగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఔషధాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే అనేక ఇబ్బందులు ఎదురవుతాయని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్. శ్రీనివాస్ అన్నారు. జాతీయ ఉత్తమ ఔషధ తయారీ విధానాల దినోత్సవంలో భాగంగా శుక్రవారం గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మందుల తయారీలో నాణ్యతపై రాజీ ఉండకూడదని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ (ఇండియా) సోమనాథ్ బసు, డాక్టర్ జీవీ రాధా, డాక్టర్ సాగర్ సుమన్ పండా, డాక్టర్ అన్నమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## భీమిలిని సందర్శించిన గీతం ఆర్కిటెక్ విద్యార్థులు

భీమునిపట్నం,అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు చారిత్రక ప్రదేశాలను గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. మొదటి, నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రెండు బ్యాచ్‌లుగా వీడి పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ రవీంద్ర మాట్లాడుతూ గీతంలో వచ్చే నెల 9, 10వ తేదీల్లో ఆర్కిటెక్చర్ డే ఉత్సవాలు జరగనున్నాయని తెలిపారు. ఈ మేరకు 150 మంది విద్యార్థులను చారిత్రక ప్రదేశాలు చూపించేందుకు తీసుకువచ్చామని చెప్పారు. ఇది తరగతి బోధనలో ఒక భాగం అన్నారు.

## వినియోగంలోకి బ్యాటరీ కారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బ్యాటరీ కారులో భక్తులు

సింహాచలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న భక్తుల సౌకర్యార్థం దాత బహూకరించిన నూతన బ్యాటరీ కారును ఆలయ అధికారులు ఎట్టకేలకు వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈనెల 7న 'అక్కరకు రాని బ్యాటరీ కార్లు' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఈఓ త్రినాథరావు స్పందించారు. ఈమేరకు శుక్రవారం వాహనానికి డ్రైవర్‌ను కేటాయించారు. స్వామివారి దర్శనానికి వచ్చే వృద్ధులు, గర్భిణీలు, దివ్యాంగులను కారులో లిఫ్ట్ వరకు తీసుకువెళుతున్నారు. ఈ కారును పీఆర్ఓ కార్యాలయం వద్ద నిలిపి ఉంచుతున్నారు.

## 'రాష్ట్రాభివృద్ధిలో చంద్రబాబు పాత్ర ఎనలేనిది'



కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

కొమ్మాది, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసి అరుదైన రికార్డు సృష్టించారని మధురవాడ టీడీపీ నాయకులు కొనియాడారు. శుక్రవారం పీఎంపాలెం కాలనీలో వారు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు పాత్ర మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, 5వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ, ఆరో వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు గరే గురునాథ్, నమ్మి రమణ, లొడగల జానకీ రామ్, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ నాగోతి సూర్య ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

## మహా నారాయణ సేవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

భీమునిపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీరాంజనేయ అయ్యప్పస్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి డిసెంబరు 5వ తేదీ వరకూ మహా నారాయణ సేవ నిర్వహించనున్నట్టు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మినేని ఎర్రునాయుడు, మొకర నరసింగరావు తెలిపారు. శుక్రవారం వారు బీచ్‌రోడ్‌లోని అయ్యప్ప ధ్యాన మందిరంలో మహా నారాయణ సేవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 16 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12.05 నుంచి 2.05 వరకూ అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు కదిరి జగన్నాథం, సహాయ కార్యదర్శి కోండ్రు గోవిందరాజు, కోశాధికారి పిల్లి శ్రీను, పట్టణ పురోహితులు సుసరాపు కామేశ్వర మాధవశాస్త్రి, సభ్యులు కంటుభుక్త ముత్యాలరావు, నల్లి నరసింగరావు, చిల్ల నరసింగరావు, అంబటి శ్రీను, ఏనుగుతల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## కొయ్యపేటను సందర్శించిన కేజీహెచ్ వైద్యులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న వైద్య బృందం

పద్మనాభం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేరేళ్లవలస పంచాయతీ కొయ్యపేట గ్రామాన్ని కేజీహెచ్ వైద్యుల బృందం శుక్రవారం సందర్శించింది. జనరల్ మెడిసన్ విభాగానికి చెందిన డాక్టర్ జగదీశ్వరరావు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం నుంచి డాక్టర్ ప్రతిమ, మైక్రో బయాలజీ విభాగం నుంచి డాక్టర్ శిరీష గ్రామాన్ని సందర్శించి రోగులతో మాట్లాడారు. పారిశుధ్య పరిస్థితులను, తాగునీటి వనరులను క్షుణ్ణంగా పరిశీలించారు. వ్యాధి ప్రబలడానికి గల కారణాలను నిశితంగా పరిశీలించారు. అనంతరం వైద్య శిబిరాన్ని పరిశీలించి రోగులకు చేస్తున్న వైద్యాన్ని, మందులను అడిగి తెలుసుకొని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి కె. లీలా ప్రసాద్, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## కాటికాపల్లిలో గ్రామ సభ



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, రైతులు

పద్మనాభం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొవ్వాడలో వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేయనున్న లేఅవుట్ కోసం రెవెన్యూ అధికారులు కాటికాపల్లి గ్రామ రైతులతో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. లేఅవుట్‌కు రైతులు భూములిస్తే డీపట్టా ఉన్న వారికి 900 గజాలు, ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్న వారికి 450 గజాలు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బాలుర వసతి గృహం తనిఖీ

పద్మనాభం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని బీసీ బాలుర వసతిగృహాన్ని తహశీల్దారు కె. ఆనందరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, వారి ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు.అలాగే ఆహారం, రోజు వారీ మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్యామల, వీఆర్ఓ అప్పలరాజు పాల్గొన్నారు.



నివాసాలకు సమీపంలో పందుల గుంపు

## జనావాసాల నడుమ పందుల సంచారం

సింహాచలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలో పలుచోట్ల జనావాసాల నడుమ పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ముఖ్యంగా ప్రియాగార్డెన్స్, గోశాల నిర్వాసితుల లేఅవుట్, టీవీ టవర్ కాలనీల్లో వీటి సంచారం ఎక్కువగా ఉంది. మురుగు కూపాలు, తుప్పల మధ్య యథేచ్ఛగా తిరుగుతూ పరిసరాలను పాడుచేస్తున్నాయి. వీటి వల్ల దోమల వ్యాప్తి పెరిగి, వ్యాధులు ప్రబలుతున్నాయి. పందుల సంచారాన్ని నిరోధించాలని కాలనీల ప్రజలు పలుమార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో పందుల కాల్చివేతకు షూటర్లను పంపేవారు. వారు వస్తున్న విషయం ముందుగానే పందుల పెంపకందారులకు తెలిసిపోతుండడంతో వాటిని దూరంగా తరలిస్తున్నారు. ఆ తరువాత పరిస్థితి షరా మామూలే. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రత్యామ్నాయం... దైవాధీనం!

... 5వ పేజీ తరువాయి

దేవదాయ శాఖ అధికారులు వందలాది ఎకరాలు అప్పగించారు. ప్రతిఫలం సాధించడంలో చొరవ చూపడం లేదు.

### దేవస్థానం రికార్డుల ప్రకారం వివిధ సంస్థలకు కేటాయించిన భూముల వివరాలు

1. 1972, 1985: ఎన్ఎస్‌టీఎల్, డిఫెన్స్ క్వార్టర్స్‌కు 37.75 ఎకరాలు
2. 1979లో మైక్రోవేవ్ రిపీటర్ స్టేషన్ (ఎస్‌ఈ రైల్వే)కు 33.41 ఎకరాలు
3. 1982లో ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (వేపగుంట) కు 144.75 ఎకరాలు
4. 1986లో బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలకు 45.32 ఎకరాలు
5. తాజాగా రైడెన్ డేటా సెంటర్‌కు 100 ఎకరాలు

వీటితోపాటు నీటి పారుదల శాఖ కార్యాలయం, రిజర్వాయర్ నిర్మాణానికి, పబ్లిక్ హెల్త్ శాఖ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సీతమ్మధారలో వీకర్ సెక్షన్, వెంకోజీపాలెంలో ఎస్సీ కాలనీ నిర్మాణానికి, కేంద్ర ప్రభుత్వానికి చెందిన టీవీ స్టేషన్, టవర్ ఏర్పాటుకు, వెంకోజీపాలెం నుంచి హనుమంతవాక వరకు హైవే విస్తరణకు, వేపగుంట పంచాయతీ ప్రహ్లాదపురంలో వెనుకబడిన ఇళ్ల కాలనీ నిర్మాణానికి ప్రభుత్వాలు గతంలో సుమారు 284 ఎకరాలు కేటాయించాయి. ఏపీఎస్ ఆర్టీసీకి సర్వే నంబర్లు 197, 198లో సింహాచలం డిపో నిర్మాణానికి 5.3 ఎకరాలు కేటాయించారు. దేవస్థానానికి ఆర్టీసీ రూ.10 లక్షలు చెల్లించింది. ఇప్పటివరకు దేవస్థానం ఖాతాకు జమ అయిన మొత్తం ఇదే. తాజాగా రైడెన్ డేటా సెంటర్‌కు అడివివరం సర్వేనంబరు 275లో 100 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ భూములు సాధించడం లేదా దేవస్థానం ఖజానాకు భూముల మార్కెట్ విలువ చేరేలా చర్యలు తీసుకోవడంపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించాలని భక్తులు కోరుతున్నారు.

## కొత్త టీచర్లకు పాఠశాలలు కేటాయింపు

... 5వ పేజీ తరువాయి

పాఠశాలలు కేటాయించారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అన్ని కేటగిరీలు కలిపి 400 మంది అభ్యర్థులకు కౌన్సెలింగ్ పూర్తిచేశారు. పాఠశాలల కేటాయింపునకు సంబంధించి ఉత్తర్వులు అభ్యర్థుల మెయిల్స్‌కు పంపారు. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు ఈనెల 13వ తేదీ (సోమవారం)న విధుల్లో చేరనున్నారు. మెగా డీఎస్సీలో చివరి అంకం శిక్షణ విజయవంతంగా ముగిసిందని, అనంతరం పాఠశాలలు కేటాయింపు పూర్తిచేశామని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు విజయభాస్కర్ తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టనున్న ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలిపారు.విద్యార్థులకు ఉత్తమ బోధన చేసి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కాగా, డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లకు ఈ నెల మూడో తేదీ నుంచి శుక్రవారం వరకూ శిక్షణ ఇచ్చారు.

## రౌడీషీటర్ హత్య

... 5వ పేజీ తరువాయి

మరింత లోతుగా విచారించగా..మృతదేహాన్ని ఎలమంచిలి సమీపంలో పడేసినట్టు చెప్పాడు. దీంతో గురువారం సాయంత్రం ఎలమంచిలి వెళ్లి, స్థానిక పోలీసుల సహాయంతో మృతదేహం ఉన్న ప్రదేశానికి వెళ్లారు. మృతదేహం బాగా ఉబ్బిపోయి దుర్వాసన వస్తున్నది. శ్రీధర్‌బాబు మృతిగురించి విజయవాడలో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం ఉదయం పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి వివరాలు సేకరించారు. ఈలోగా మృతుడి తల్లి,భార్య, పిల్లలు ఎలమంచిలి చేరుకున్నారు. శ్రీధర్‌బాబు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. గౌరీశంకర్‌ను అదుపులోకి తీసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్టు ఎంవీపీ సీఐ ప్రసాద్ తెలిపారు.

## 2047 నాటికి 50 శాతం పచ్చదనం

... 5వ పేజీ తరువాయి

చేస్తామన్నారు. నగర వనాల్లో వాకింగ్, యోగా, ధ్యానం చేసుకునేందుకు సదుపాయాలు కల్పిస్తామన్నారు. అడవిలో ఉన్నామనే భావన వచ్చేలా ఏర్పాట్లుచేస్తామన్నారు. అలాగే ఎకో టూరిజాన్ని ప్రోత్సహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అరకులోయ, అనంతగిరి, లంబసింగి, వంజంగి తదితర ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. వచ్చే నెల నుంచి సముద్రతీర ప్రాంతాలకు తాబేళ్ల రాక ప్రారంభమవుతుందని కన్జర్వేటర్ పేర్కొన్నారు. గత సీజన్‌లో మూడు లక్షల తాబేళ్ల గుడ్ల రక్షణకు కేంద్రాలు ఏర్పాటుచేశామని, వాటి నుంచి 80 శాతం పిల్లలు బయటకు రాగా సముద్రంలో విడిచిపెట్టామన్నారు. తాబేళ్ల రక్షణకు నెస్టింగ్ కేంద్రాల ఏర్పాటు, ప్రజలకు చైతన్యం పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## విశాఖకు పెట్టుబడుల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

అండ్ రిసార్ట్ ఏర్పాటు చేసి రూ.55.84 కోట్లతో 98 మందికి ఉద్యోగాలు ఇస్తుంది.

- వరుణ్ బీచ్ సంస్థ బీచ్‌రోడ్డులో పునర్నిర్మించే ప్రాజెక్టుకు పర్యాటక శాఖ నుంచి రాయితీలు ఇవ్వాలని తీర్మానించారు.
- విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామని హామీ ఇచ్చిన రూ.2,400 కోట్లను విద్యుత్ బిల్లుల రూపేణా సమకూర్చాలని తీర్మానించారు. ఇప్పటివరకూ రూ.753.29 కోట్ల విద్యుత్ బకాయిలు ఆర్ఐఎన్ఎల్ చెల్లించాల్సి ఉంది. ఈపీడీసీఎల్ రెండేళ్ల పాటు బిల్లులు తీసుకోకుండా ఉండేలా, ఆ మొత్తాన్ని విద్యుత్ సంస్థకు పదేళ్ల తరువాత ప్రిఫరెన్షియల్ షేర్ క్యాపిటల్‌గా మార్చడానికి నిర్ణయించారు.

## కారుణ్య నియామకాలకు కలెక్షన్

... 5వ పేజీ తరువాయి

ఉంటుంది. కాబట్టి అర్హత కలిగిన వారికి ఫోన్ చేసి రూ.1.5 లక్షలు ఇస్తే ఉద్యోగం ఇస్తామని ప్రలోభపెడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఎవరైనా అంతమొత్తం ఇచ్చుకోలేమంటే రూ.50 వేలు కనీస మొత్తంగా చెల్లించాలని అడిగారు. అదే వర్క్ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు అయితే రూ.లక్ష వరకు డిమాండ్ చేసినట్టు సమాచారం. కారుణ్య కోటాలో ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న ఒక మహిళా అభ్యర్థినితో సదరు ఉద్యోగి లంచం గురించి మాట్లాడినప్పుడు ఆమె రికార్డింగ్ చేసి తనకు తెలిసిన వారికి పంపించారు. దీంతో 'కారుణ్య కోటా'లో ఉద్యోగాల భర్తీ కోసం వసూళ్లపర్వం బయటకు వచ్చింది. వసూళ్ల తతంగం దాదాపు పూర్తికావడంతో వారి ఫైల్‌ను త్వరలోనే కమిషనర్‌కు పంపించాలని సూత్రధారి అయిన అధికారి యోచిస్తున్నట్టు చెబుతున్నారు.

## వైసీపీ ప్రభుత్వం ఉత్తరాంధ్రకు ఏం చేసింది?

### వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



సిరిపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వంలో ఏం చేశారో చెప్పాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైద్య కళాశాల సందర్శన పేరుతో పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్‌రెడ్డి షో చేశారని విమర్శించారు. జగన్ నర్సీపట్నం టూర్ అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. వైసీపీ బ్యాచ్ హడావిడి, కేజీహెచ్‌లో దౌర్జన్యాలు తప్ప ఒరగబెట్టిందేంటన్నారు. రుషికొండ ప్యాలెస్ నిర్మాణంలో చూపిన శ్రద్ధ నర్సీపట్నం వైద్య కళాశాలపై ఎందుకు చూపలేదని ప్రశ్నించారు. వీటిని పట్టించుకోకుండా వదిలేశారని, కూటమి ప్రభుత్వం వాటిని పూర్తి చేసి, పేదలకు వైద్య సేవలు అందించాలనే తలంపుతో ఉందన్నారు. అందుకనే పీపీపీ విధానం అమలు చేస్తుందన్నారు. వైసీపీ బ్యాచ్‌కు వైద్య కళాశాలల నిర్మాణం అడ్డుకోవటమే లక్ష్యమన్నట్లుగా కార్యక్రమాలు చేస్తున్నారని, దీన్ని ప్రజలు గమనించాలన్నారు. నగర పోలీసు కమిషనర్‌పై వైసీపీ బ్యాచ్ విమర్శలు చేయటం మానుకోవాలన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఇక్కడికి కార్పొరేట్ సంస్థలను తీసుకొస్తుందన్నారు. విశాఖలో త్వరలోనే టీసీఎస్ క్యాంపస్ ప్రారంభిస్తామన్నారు. గూగుల్ డేటా సెంటర్ రాబోతుందని, దీనితోపాటు త్వరలోనే మరో నాలుగు కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయన్నారు. వైసీపీ నాయకులు సృష్టించే ఆటంకాలను అధిగమించి, ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.

## ఉనికి కోల్పోయిన ముడసర్లోవ పార్కు



రచ్చబండ చుట్టూ ఉన్న తుప్పలు

ఆరిలోవ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ముడసర్లోవ పార్కుకు గతంలో ప్రజలు ఎంతో ఉత్సాహంతో వెళ్లేవారు. కానీ నేడు కళావిహీనంగా మారడంతో ఇది పార్కు అవునా ? కాదా ? అనే సంశయం పర్యాటకులకు వస్తోంది. ఇక్కడ ఉన్న పెద్ద చెట్ల చుట్టూ రచ్చబండలు నిర్మించారు. వన భోజనాలకు వస్తున్నవారు కుటుంబ సమేతంగా చెట్ల కింద కూర్చుని ఉల్లాసంగా గడిపేవారు. ప్రస్తుతం ఏ రచ్చబండ వద్దకు వెళ్లినా చిట్టడవిని తలపిస్తోంది. వచ్చే కార్తీక సమారాధనలను దృష్టిలో పెట్టుకొని పార్కును బాగుచేయాలని పలువురు కోరుతున్నారు.

### సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ -2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజి** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

### రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 27, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 30, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 32, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 52, దొండకాయలు 32, బంగాళదుంపలు 20 అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో)76, అల్లం (పాతది) 72, బరబాటి 42,ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40,బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 26, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద36, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 100, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

**కోడిగుడ్లు (నెక్)**

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 515 |
| విజయనగరం | 519 |
| శ్రీకాకుళం | 519 |

**చికెన్ ధరలు**

బ్యాగ్

| | |
|---|---|
| రైతు ధర | 125 |
| లైవ్ ధర | 145 |
| విత్ స్కిన్ | 260 |
| స్కిన్‌లెస్ | 270 |



మద్దిలపాలెం జాతీయ రహదారిపై పార్కింగ్ చేసిన వాహనాలు



జయభేరి ఎదురుగా 60 అడుగుల రోడ్డు మలుపులో మెకానిక్ షాప్

# రోడ్లా..పార్కింగ్ స్థలాలా?

- హైవేపైనే వాహనాల నిలిపివేత
- రోడ్డు మలుపుల్లో దుకాణాలు
- ప్రయాణికులకు ఇబ్బందులు

మద్దిలపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం వద్ద జాతీయ రహదారిలో వాహనాలను ఇష్టానుసారం నిలుపుతున్నారు. సత్యం జంక్షన్ నుంచి మద్దిలపాలెం సిగ్నల్ పాయింట్ వరకు జాతీయ రహదారి పార్కింగ్ స్థలంలా మారిపోయింది. సుమారు కిలోమీటరు నిడివిలో రోడ్డులో వాహనాల మెకానిక్, ఇంటీరియర్, డెక్కర్స్, టైర్ల దుకాణాలు ఉన్నాయి. దీంతో ఆయా షాప్‌లకు వచ్చే వాహనాలతో రోడ్డంతా పార్కింగ్‌తో నిండిపోతుంది. దీనికి తోడు జయభేరి షోరూమ్ ఎదురుగా 60 అడుగుల రోడ్డు మలుపులో మెకానిక్ దుకాణంతో మరింత జటిలంగా మారింది. రోడ్డు మలుపు తిరిగే దగ్గర వరుసగా దుకాణాలు ఏర్పాటు చేయడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. మెకానిక్ షాప్‌లు, డెక్కర్స్‌కు పదుల సంఖ్యలో వచ్చే కార్లు రోడ్డు మీదే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ నిలిచిపోతుంది. విశాలమైన మద్దిలపాలెం జాతీయ రహదారిలో కార్లు, ట్రావెల్స్ వెహికల్స్ పార్కింగ్ చేస్తూ ఇరుకు రోడ్డుగా మారుస్తున్నారు.

**ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ శూన్యం..**

జాతీయ రహదారిపై ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నా ట్రాఫిక్ పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. మెకానిక్, డెక్కర్స్ దుకాణాల ముందు పదుల సంఖ్యలో కార్లు ఉన్నా చర్యలు తీసుకోవడం లేదు.కొనుగోలు చేయడానికి వచ్చిన వాహనాలైతే అయిదు, పది నిమిషాల్లో వెళ్లిపోతారు. కానీ రిపేర్లు, ఇంటీరియర్స్‌కు తెచ్చిన వాహనాలు గంటల సమయం, మరికొన్ని రెండు, మూడు రోజులు కూడా రిపేర్ చేయాల్సి ఉంటుంది. అప్పటివరకు రోడ్లపైనే వాటిని నిలిపివేయాలి. అందుకే మెకానిక్ షాప్‌ల వల్ల వాహనాలు గంటల తరబడి పార్కింగ్‌లో ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా రోడ్డు మలుపుల వద్ద పార్కింగ్ చేసిన వాహనాలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మలుపు నుంచి వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. పాదచారులు సైతం ఇక్కడ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లను ఇష్టానుసారంగా ఆక్రమించుకున్నా ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దుకాణాల నుంచి పోలీసులకు నెలవారీ మామూళ్లు అందుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయమై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.



జేసీబీతో శ్మశాన వాటికను శుభ్రం చేసిన దృశ్యం

## శ్మశాన వాటికలో తుప్పల తొలగింపు

వెంకోజీపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు పాత వెంకోజీపాలెంలో సీతారామ సేవా సంఘం, గ్రామ సేవా సంఘం ఉపయోగించే శ్మశాన వాటికలో పేరుకుపోయిన తుప్పలు, చెత్తాచెదారాన్ని జేసీబీతో శుక్రవారం ఉదయం తొలగించారు. మృతదేహాన్ని అంతిమ సంస్కారానికి తీసుకెళ్లేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ఇరు సంఘాల పెద్దలు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి శ్మశానవాటికను శుభ్రం చేయించారు. అక్కడ చేతిపంపు (బోరు బావి) ఉపయోగపడకపోవడంతో కొత్త చేతిపంపును కూడా వేయించారు. జీవీఎంసీ నుంచి రూ.10 లక్షలు మంజూరై ఉన్నా శ్మశాన వాటిక స్థలం వ్యవహారం కోర్టులో ఉన్నందున అభివృద్ధి చేయడం వీలుకావడం లేదని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆర్డీవోతో మాట్లాడారని, త్వరలో సమస్య పరిష్కారమవుతుందని సంఘాల ప్రతినిధులకు తెలిపారు. గ్రామ సేవా సంఘం అధ్యక్షులు ఆడారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీలా ప్రేమ్ కిరణ్ జగదీష్, సీతారామ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు మళ్ల పోలిరాజు, అధ్యక్షుడు కర్రి వెంకట సూరిఅప్పారావు, ఇతర కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న సీపీపీ ఎ.ప్రభాకరరావు

## ఓపెన్ ఫోరానికి 15 వినతులు

వెంకోజీపాలెం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 15 వినతులు వచ్చాయని చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి శుక్రవారం ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వీకరించిన వినతులను/ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరమ్‌లో అందజేయవచ్చునని తెలిపారు.

## 'ఆడపిల్లలను కాపాడు'పై పోటీలు

అక్కయ్యపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): 'ఆడపిల్లలను కాపాడు' (సేవ్ గర్ల్ చైల్డ్)పై 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయిలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలను మండల విద్యాశాఖాధికారి బాలామణి పర్యవేక్షించారు.



తీరంలో పర్యాటకుల సందడి (ఫైల్)



సముద్రంలో రాళ్లపై ఫొటోలు దిగుతున్న సందర్శకులు

# అలల మాటున ప్రమాదాలు

- ఆర్కే బీచ్‌లో తరచూ సంఘటనలు
- హెచ్చరికలు పట్టని సందర్శకులు
- ఫొటోల కోసం సంద్రం లోపలికి వెళుతున్న పర్యాటకులు

బీచ్ రోడ్డు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్కే బీచ్‌లో ఇటీవల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఫొటోలు, సెల్ఫీల కోసం సందర్శకులు సముద్రం లోపలికి వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. సాధారణ రోజుల కంటే అల్పపీడనం, తుపాన్ల సమయంలో తీరంలో అలలు ఎగిసి పడుతుంటాయి. సాధారణ అలలే కదా అని భావించి కొందరు లోపలికి వెళుతున్నారు. సంద్రం లోపలకు వెళ్లడం ప్రమాదకరమని పోలీసులు, లైఫ్ గార్డులు హెచ్చరిస్తున్నా.. పట్టించుకోవడం లేదు. బీచ్‌లో ఉన్న రాళ్ల వద్ద ఫొటోలు దిగేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతారు. కెరటాలు ఉధృతంగా ఉన్నప్పుడు రాళ్ల వద్దకు వెళ్లడం ప్రమాదాలను కొనితెచ్చుకోవడమే. పొరపాటున జారి పడితే గాయాలపాలయ్యే అవకాశాలు ఎక్కువ.

**ఇటీవల జరిగిన ప్రమాదాలు**

- పూర్ణా మార్కెట్ కళ్లపాకల ప్రాంతానికి చెందిన రియాసత్ (10), ఎర్ని కుమార్ (13), వి. శశికుమార్ (13) ఇటీవల ఆర్కే బీచ్‌కు వచ్చారు. బీచ్‌లో స్నానాలకు దిగారు. అలల ఉధృతి ఎక్కువ కావడంతో ముగ్గురూ లోపలకు కొట్టుకుపోయారు. గమనించిన లైఫ్ గార్డులు వారిని సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. అలాగే సికింద్రాబాద్ నుంచి వచ్చిన వసంత (58) సముద్రంలో స్నానం చేద్దామని వెళ్లారు. కెరటాల తాకిడికి గల్లంతయ్యారు. కంచరపాలెం ప్రాంతానికి చెందిన అల్లు లోకనాథం (50) కూడా సముద్రంలోకి దిగగా కెరటాల తాకిడి ఎక్కువగా ఉండ డంతో కొట్టుకుపోయారు. లైఫ్ గార్డులు సకాలంలో స్పందించి అత డ్ని ఒడ్డుకు చేర్చారు. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన ఆన్స్ రాథోడ్ (20) నాగపూర్‌లో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి బీచ్‌కు వచ్చాడు. సముద్రంలో స్నానం చేస్తుండగా కెరటాల తాకిడికి కొట్టుకుపోయారు. తక్షణమే స్పందించిన లైఫ్ గార్డులు, మెరైన్ పోలీసులు అతడ్ని కాపాడారు. ఇటువంటి ప్రమాదాలు తీరంలో ఇటీవల ఎక్కువయ్యాయి.

**ఎవరూ వినడం లేదు**



తీరంలో విధులు నిర్వహిస్తున్నాను. కొన్ని సందర్భాల్లో చాలా లోపలకు వెళ్లి సందర్శకుల ప్రాణాలు కాపాడాను. ఇక్కడ గజ ఈతగాళ్లు ఉన్నా.. కొన్ని సందర్భాల్లో పిల్లలు, పెద్దవాళ్లు సరదా కోసం సముద్ర స్నానాలు చేస్తుంటారు. కెరటాల తాకిడి ఎక్కువగా ఉన్నప్పుడు హెచ్చరించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

- బి. పోలరాజు, త్రీటౌన్ కానిస్టేబుల్

## నిర్మాణాల్లో నాణ్యత ముఖ్యం : డీఆర్‌ఎం బొహ్రా



ఇంజనీర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ ప్రధాన కార్యాలయంలోని డీఆర్‌ఎం సమావేశ మందిరంలో శుక్రవారం వినియోగదారులు, ఇంజనీర్లతో అమృత్ సంవాద్ కార్యక్రమం జరిగింది. డీఆర్‌ఎం లలిత్ బొహ్రా పాల్గొని మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులు, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేపట్టిన నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. అమృత భారత్ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయడంలో ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు భాగస్వాములు కావాలన్నారు. రైల్వే కార్యకలాపాలు సురక్షితంగా సాగడానికి భద్రతా నిబంధనలు పాటించడం, ప్రమాణాలను అమలు చేయడం ముఖ్యమని పేర్కొన్నారు. ప్రాజెక్టుల నిర్మాణ పనులకు సంబంధించి వివిధ అంశాలపై ఇంజనీర్లు, వినియోగదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (కో-ఆర్డినేషన్) ఎ.కె.మెహరానా పాల్గొన్నారు.

## దీపాల తయారీలో శిక్షణ



దీపాల తయారీలో శిక్షణ పొందుతున్న దివ్యాంగ బాలలు

అక్కయ్యపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో దివ్యాంగ బాలలకు శుక్రవారం మట్టి మోడలింగ్, దీపాల తయారీలో శిక్షణ ఇచ్చారు. ప్రజ్వలవాణి వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకురాలు సుచిత్ర మాట్లాడుతూ దివ్యాంగ బాలల జీవనోపాధి కి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. వృత్తిపరమైన శిక్షణ, సృజనాత్మక నైపుణ్య అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. మట్టితో దీపాల డిజైన్‌లను తయారు చేసి, వాటిని ఎరుపు, ఆకుపచ్చ, నీలం రంగులతో అలంకరిస్తారన్నారు. తయారైన దీపాలను కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రదర్శిస్తామన్నారు.



పార్కులో ఆటలు ఆడుతున్న విద్యార్థులు

## 30 సంవత్సరాల కల ఫలించింది

- హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు
- ఎమ్మెల్యేకు, ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు

వెంకోజీపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గత 30 ఏళ్లుగా ఖాళీగా ఉండి ఎన్నో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన జగన్నాథరాజు నగర్‌లోని 2000 చదరపు గజాల స్థలానికి విముక్తి లభించిందని జేఆర్‌నగర్ కాలనీ నివాస సంక్షేమ సంఘం వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన తమ కాలనీలోని సమస్యల కథనాలు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చొరవ, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ సహకారంతో జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ఖాళీ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయించారని కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనివలన మందుబాబులు, గంజాయి తాగేవారు, ఇతర అసాంఘిక శక్తులను కట్టడి చేయవచ్చని సంఘం అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.మూర్తి, సభ్యులు బి.పెరుమాళ్లరాజు, జి.ఎస్.శివప్రకాష్‌లు తెలిపారు. కాలనీవాసులు ధైర్యంగా ఈ ప్రదేశంలో సంచరించగలరన్నారు. ఉదయాన్నే వ్యాయామం చేసుకునేవారు ఎంతో ఆనందిస్తున్నారని, విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా ఈ స్థలం మారినందుకు తమకెంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ స్థలం మధ్యలో నాలుగు దీపాల స్తంభాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని కాలనీవాసులు కోరుతున్నారు.

## చిరు వ్యాపారులకు రక్షణ కల్పించాలి



ఎమ్మెల్యే గంటా నివాసం సమీపంలో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తోపుడు బళ్లు, చిల్లర వర్తకులకు రక్షణ కల్పించాలంటూ ఎంవీపీ కాలనీలోని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసం సమీపంలో సీఐటీయూ మధురవాడ కమిటీ శుక్రవారం ధర్నా చేసింది. చిరు వ్యాపారులతో కలసి గంటా నివాసానికి వెళ్లడానికి ప్రయత్నించిన వారిని పోలీసులు వీధి మొదటిలోనే అడ్డుకున్నారు. జీవీఎంసీ అధికారులు, పోలీసులు బడ్డీలపై చేపడుతున్న దాడులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. వర్తకులకు గుర్తింపు కార్డులు, హక్కు పత్రాలు ఇవ్వాలని నినదించారు. చిరు వ్యాపారులకు సబ్సిడీ రుణాలివ్వాలని, హాకర్ జోన్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని, బడ్డీలు తొలగించడం వల్ల నష్టపోయిన వ్యాపారులకు పరిహారం అందచేయాలని డిమాండ్ చేశారు.

## సామూహిక కుంకుమ పూజ



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ఆరిలోవ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దుర్గా నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఆరిలోవలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు. టీఐసీ పాయింట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజలో మహిళలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాపరుద్ర ఇక్కడకు విచ్చేశారు. 9వ వార్డు సంజీవనగర్, 10వ వార్డు ఇందిరానగర్‌లో ప్రతాప రుద్ర పాల్గొన్నారు. బుడుమూరు గోవింద్, బుడుమూరు భూలక్ష్మి తదితరులు పాల్గొని అన్న ప్రసాద వితరణ చేశారు. 12వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గాడి సత్యం, రావిపల్లి రవితేజ, చంటి అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ వద్ద గోడు వెళ్లబోసుకున్న జనం

### వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న అమర్‌నాథ్

మద్దిలపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి పర్యటనకు వేలాది మంది తరలివచ్చారని ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. మద్దిలపాలెంలోని వైసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా నర్సీపట్నం సందర్శనకు వచ్చిన జగన్‌కు అడుగడుగునా నీరాజనం పట్టారన్నారు. దారి పొడుగునా కూటమి ప్రభుత్వం బాధితులు తమ నేతను కలిసి తమ బాధలు చెప్పుకొన్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు సైతం జగన్ వద్ద తమ గోడు వెళ్ల బోసుకున్నారని చెప్పారు. పోలీసులు తీవ్ర ఆంక్షలు విధించినా జగన్ పర్యటన విజయవంతమైందన్నారు.

## విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలి

డాబాగార్డెన్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఐఎన్‌భవన్‌లో భారత్ వికాస్ పరిషత్ (విశాఖపట్నం శాఖ) ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు హిందీ దేశభక్తి, సంస్కృత దేశభక్తి, ప్రాంతీయ భాషలో జానపద గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌ఎస్‌ఈ అధికారి నాయుడు, ఆచార్య పి. అర్జున్, ఎంవీవీ సత్యనారాయణ, భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ, కార్యదర్శి పి.భాస్కరరావు, మాణిక్యాలరావు, కన్వీనర్లు శైలజ, రాజశేఖర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు సంఘీభావ ర్యాలీ

డాబాగార్డెన్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఎల్‌ఐసీ, డాబాగార్డెన్స్, కృష్ణాగార్డెన్స్ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించినట్లు జీవీఎంసీ ఏయూటీడీ కార్యదర్శి పి.వాసు తెలిపారు. నిరాశ్రయుల స్థితిగతులు, ఇబ్బందులు, మౌలిక వసతులపై ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. ర్యాలీలో ప్లకార్డులు చేతపట్టుకొని ప్రజలకు నిరాశ్రయులపై అవగాహన కలిగించామన్నారు.

## దండుబజారు వద్ద అన్న ప్రసాద వితరణ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, కూటమి నాయకులు

మహారాణిపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేటలోని దండుబజారు దుర్గాదేవి ఆలయం వద్ద నిర్వహించిన దసరా ఉత్సవాల నేపథ్యంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కూటమి నాయకులు ఉరుకూటి గణేష, అంగటి శ్రావణకుమార్, బంగారు రాజు, చొక్కాకుల రాంబాబు, మన్యాల శ్రీనివాస్, పల్లా చలపతిరావు, వెంకట అప్పారావు, కొంద్రు శ్రీను, మురళి, రామకృష్ణ పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాల మార్పు



నూతన విద్యుత్ స్తంభం వద్ద టీడీపీ నాయకులు

కంచరపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం మెట్టు వద్ద దసరా పండగ రోజు విద్యుత్ సర్వీస్ వైరు తెగిపడి వ్యక్తి మృతి చెందిన ఘటనలో భాగంగా అక్కడ ప్రమాదకరంగా ఉన్న రెండు స్తంభాలను శుక్రవారం అధికారులు మార్చారు. విద్యుత్ షాక్‌తో మృతిచెందిన బత్తిన ఈశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించడానికి విశాఖ ఎంపీ శ్రీభరత్ మెట్టు వద్ద గాంధీనగర్ గ్రామానికి వచ్చిన సంగతి తెలిసిందే. ప్రమాదకరంగా ఉన్న స్తంభాల దుస్థితిని స్థానికులు ఎంపీకి వివరించారు. ఎంపీ ఆదేశాల మేరకు కంచరపాలెం సబ్ స్టేషన్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టీకే నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం శిథిల స్థితిలో ఉన్న రెండు విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని అమర్చారు. ఎంపీ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జీవీఎంసీ 55వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బండి రంజిత్, ప్రధాన కార్యదర్శి రమణ అప్పారావు, మాజీ కార్పొరేటర్ ఎన్.అప్పారావు పనులను పర్యవేక్షించారు.

## బతుకు భద్రత కల్పించరూ!

సీతంపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్స్ అండ్ ప్రైవేట్ మోటార్ వాహన డ్రైవర్లకు బతుకు భద్రత కల్పించాలని, ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆదాయం కోల్పోయిన ఆటోలు, వ్యానులు, జీపు డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని, డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అందజేసిన వినతిని పరిశీలించిన ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తానన్నారు.


## శరవేగంగా అభివృద్ధి పనులు



పనులు పరిశీలిస్తున్న గంకల అప్పారావు

కంచరపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డులో యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు బీజేపీ నాయకుడు గంకల అప్పారావు పేర్కొన్నారు. వార్డులో అన్ని ప్రాంతాలకు ప్రధాన కాలువల నిర్మాణం పనులు చేపడుతున్నట్టు తెలిపారు. శ్రీనివాసనగర్, బర్మాక్యాంప్, బాపూజీనగర్‌లలో కాలువల మరమ్మతులను అప్పారావు శుక్రవారం పరిశీలించారు. పనులు నాణ్యంగా చేపట్టాలని సంబంధిత అధికారులను సూచించారు. బాపూజీ నగర్‌లో మినీ కల్యాణ మండపం నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో సామాజిక భవనాలు, రోడ్ల నిర్మాణం పూర్తిచేశామన్నారు. మిగిలిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పూర్తిచేస్తామన్నారు.

## ఉత్సాహంగా చందనోత్సవం



చందనోత్సవంలో పాల్గొన్న ముస్లింలు

మద్రిపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్యార్వి షరీఫ్ చందనోత్సవం జాకీర్ హుస్సేన్ నగర్ మసీద్ ఈ ఆల్ ఖదీర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మసీద్ ప్రాంగణంలో స్థానిక ముస్లింలు ఖురాన్ పఠించారు. వేడుకల్లో భాగంగా మద్రిపాలెం మత గురువులు నాతే కలాంలు ఆలపిస్తూ శాంతిర్యాలీ నిర్వహించారు. అనంతరం కాలనీ హజ్రత్ గౌస్ పాక్ నిషాని షరీఫ్ వద్ద ఫాతిహా నిర్వహించి బావుటా పవిత్ర వస్త్రం సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని మసీదు కమిటీ అధ్యక్షుడు మున్నా, ఉర్స్ కమిటీ సభ్యులు లతీఫ్ తదితరులు పర్యవేక్షించారు.

# ప్రమాదకర స్థితిలో ఆర్పీపేట ఉన్నత పాఠశాల

▸ పక్కకు ఒరిగిన ఐరన్ గ్రిల్స్ ▸ బీటలు వారిన శ్లాబ్స్ ▸ ఆందోళనలో విద్యార్థులు



ఆర్పీపేట పాఠశాల భవనం

కంచరపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 56వ వార్డు పరిధి కంచరపాలెం మెట్టు వద్ద గల రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాల వేల మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించిన దేవాలయం. పరిసర ప్రాంతాల్లో ఎక్కడా ఉన్నత పాఠశాల అందుబాటులో లేకపోవడంతో కంచరపాలెం, జ్ఞానాపురం, బర్మాక్యాంప్, కప్పరాడ, చాకలి గెడ్డ తదితర ప్రాంతాల నుంచి నిరుపేద విద్యార్థులు ఇక్కడకు వస్తుంటారు. పాఠశాల భవనం ప్రస్తుతం శిథిల స్థితిలో ఉండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ భవనం నిర్మించి దాదాపు ఐదు దశాబ్దాలు గడవడంతో పాఠశాల గోడలు, శ్లాబులు బీటలు వారాయి. వర్షం పడితే పూర్తిగా తరగతి గదుల్లోకి నీరు లీకవుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాల్లో ప్రధాన భవనం ఎల్ ఆకారంలో ఉండి ఒకే గేటు ఉంది. అవాంఛనీయ ఘటనలు జరిగితే భారీ నష్టం ఎదురయ్యే ప్రమాదం ఉంది. భారీ వర్షం కురిసినప్పుడు ఉపాధ్యాయులు, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూస్తుంటారు. ప్రస్తుతం పాఠశాల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు ఉంది. సుమారు 700 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి 26 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులు, నలుగురు కాంట్రాక్టు ఉద్యోగులు బోధిస్తుంటారు.



ఊడిపోతున్న ఇనుప గ్రిల్స్

### జీవీఎంసీ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదు

ఈ పాఠశాల దుస్థితిపై ఇక్కడ గతంలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన ఆర్.శ్రీనివాసరావు జీవీఎంసీ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు పాఠశాలను సందర్శించి శిథిల స్థితిపై కమిషనర్‌కు నివేదిక అందించారు. పాఠశాల భవనం ప్రమాదకర స్థితిలో ఉందని తమ నివేదికలో పేర్కొన్నారు. ఇదే విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ప్రత్యామ్నాయ చర్యలు కార్యరూపం దాల్చలేదు. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఎంపీ కార్యాలయ సిబ్బంది పరిశీలన

ఆర్పీపేట పాఠశాల భవనం శిథిల స్థితిలో ఉందన్న సమాచారం విశాఖ ఎంపీ శ్రీభరత్ దృష్టికి వెళ్లడంతో తన కార్యాలయ సిబ్బందిని పాఠశాలకు పంపారు. పాఠశాలకు వచ్చిన ఎంపీ కార్యాలయ సిబ్బంది భవనం స్థితిగతులపై ఆరా తీసి స్వయంగా పరిశీలించారు. పైన అధ్వానంగా ఉన్న శ్లాబ్, తరగతి గదులు, గోడలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం పరిస్థితిని ఎంపీకి వివరిస్తామన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ భవనం స్థితిపై దృష్టి సారించి ఎటువంటి ఇబ్బంది ఎదురు కాకముందే తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

# పీపీపీ విధానంపై అవగాహన పెంచుకోండి

▸ వైసీపీ నాయకులకు దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సలహా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

సీతంపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డికి పీపీపీ విధానం అంటే ఏమిటో తెలియదని, దీనిపై ఆ పార్టీ నేతలు అవగాహన పెంచుకోవాలని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో గల జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాలలు ప్రైవేటుపరం కావడం లేదని, రాష్ట్రంలోని 17 కళాశాలలకు జగన్ ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టిందో తెలపాలని డిమాండ్ చేశారు. పీపీపీ వల్ల నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని, పేద విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. 33 సంవత్సరాల తర్వాత యథావిధిగా కళాశాలలు ప్రభుత్వ అజమాయిషీకి వస్తాయన్నారు. ప్రజలు కోరుకునే విధంగా పరిపాలన సాగుతోందని వంశీకృష్ణ పేర్కొన్నారు. జగన్ అయిదేళ్ల పాటు నిద్రపోయి ప్రజలను తప్పుదారి పట్టించేందుకే ఇప్పుడు బయటకు వచ్చారన్నారు. జగన్ ఆత్మపరిశీలన చేసుకోవాలని, ఆయనలో మార్పు రావాలన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం జగన్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రధానమంత్రి మోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడి ప్రైవేట్ పరం కాకుండా కాపాడారన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామన్నారు. జగన్ ఎక్కడకు వెళ్లినా ఇదే భజన బెల్టు వెనకాల ఉంటుందని ఎద్దేవా చేశారు. జనసేన నాయకులు శివప్రసాద్ రెడ్డి, వసంతలక్ష్మి, కందుల నాగరాజు, మాసిపోగు రాజు, టీడీపీ నాయకుడు అక్కిరెడ్డి జగదీష్ పాల్గొన్నారు.

### అసత్యాలతో జగన్ ప్రజలను మభ్యపెడుతున్నారు: ఎండీ నజీర్

మహారాణిపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ అసత్యాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. శుక్రవారం ఆయన టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ జగన్ వితండ వాదనతో ప్రభుత్వంపై లేనిపోని అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. వైసీపీ పాలనలో కేవలం నాలుగైదు కళాశాలల్లో మాత్రమే నలభై శాతం పనులు పూర్తి చేశారని, మిగిలినచోట్ల పునాదుల స్థాయిలోనే ఉన్నాయన్నారు. గత ఐదేళ్లలో కేంద్రం ఇచ్చిన నిధులు తప్ప ఒక్క రూపాయి కూడా వైసీపీ ప్రభుత్వం ఖర్చు చేయలేదని, ఉత్తరాంధ్ర ప్రజలు జగన్ అసత్య ప్రచారానికి స్పందించలేదన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వారి పార్టీ పెద్దల మెప్పు కోసం నోటికి వచ్చిన అసత్యాలు మానుకుని, వాస్తవాలపై అవగాహన పెంచుకోవాలని సలహా ఇచ్చారు.

## విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలి

డాబాగార్డెన్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఐఎస్‌భవన్‌లో భారత్ వికాస్ పరిషత్ (విశాఖపట్నం శాఖ) ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు హిందీ దేశభక్తి, సంస్కృత దేశభక్తి, ప్రాంతీయ భాషలో జానపద గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఆర్ఎస్ఈ అధికారి వీఆర్ నాయుడు మాట్లాడుతూ బాగా చదువుకుని దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలన్నారు. పోటీల అనంతరం జాతీయ దేశభక్తి బృందగాన పోటీలు, భారత్ కో జానో క్విజ్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆచార్య పి.అర్జున్, ఎంవీవీ సత్యనారాయణ, భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ, కార్యదర్శి పి.భాస్కరరావు, జీఎస్‌వీ మాణిక్యాలరావు, కన్వీనర్స్ ఎం.ఎస్.ఎల్.శైలజ, ఎం.వి.రాజశేఖర్, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు సంఘీభావ ర్యాలీ

డాబాగార్డెన్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఎల్ఐసీ, డాబాగార్డెన్స్, కృష్ణాగార్డెన్స్ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించినట్లు జీవీఎంసీ ఏయూటీడీ కార్యదర్శి పి.వాసు తెలిపారు. నిరాశ్రయుల స్థితిగతులు, ఇబ్బందులు, మౌలిక వసతులపై పలువురు ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు.ర్యాలీలో ప్లకార్డులు చేతపట్టుకొని ప్రజలకు నిరాశ్రయులపై అవగాహన కలిగించామన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని సంఘీభావం తెలియజేశారని పేర్కొన్నారు. వివిధ షెల్టర్స్‌లో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయులు పాల్గొన్నారు.

## ఏళ్ల నాటి మట్టిరోడ్డుకు మోక్షం!



కొత్తగా తీర్చిదిద్దిన కామాక్షినగర్ తారు రోడ్డు

మురళీనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తరంలోని 49వ వార్డు కామాక్షినగర్ రాళ్ల దారి ఇప్పుడు తారురోడ్డుగా నవీకరించారు. ఏళ్ల నాటి మట్టిరోడ్డుకు మోక్షం రావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించారన్న ఫిర్యాదుతో ఏళ్లుగా ఇక్కడి కామాక్షినగర్ రైల్వే సొసైటీ నివాసితులకు రోడ్డు లేకుండా పోయింది. లేఅవుట్ రూపకల్పన సమయంలోనే మాకు దారి ఉందన్న నివాసితుల వాదనకు బలం చేకూరి ఎట్టకేలకు సమస్యకు తెరపడింది. దారిలో అడ్డుగా ఉన్న రెండు పూరి గుడిసెల్ని ప్రత్యామ్నాయ ప్రభుత్వ భూమిలోకి మార్చి ఊర్వశిజంక్షన్ బర్మాక్యాంప్ అనుసంధాన దారికి కలుపుతూ ఇపుడు కొత్తగా తారు రోడ్డు వేశారు. ఇంజనీరింగ్ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు చేసుకున్న విన్నపాలు ఇన్నాళ్లకు నెరవేరడంతో శాశ్వత మార్గం వచ్చిందని కామాక్షినగర్ నివాసితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ నిధులతో చేపట్టిన పనులు పూర్తవడంతో కామాక్షినగర్, మాణిక్యాంబకాలనీ, పట్టాభిరెడ్డితోటకు వెళ్లే వందలాదిమందికి ఊరట కలుగుతోంది.

## 'ఆడపిల్లలను కాపాడు'పై పోటీలు



పోటీలు పర్యవేక్షిస్తున్న ఎంఈవో బాలామణి

అక్కయ్యపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): 'ఆడపిల్లలను కాపాడు' (సేవ్ గర్ల్ చైల్డ్)పై గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయిలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మండల విద్యాశాఖాధికారి బాలామణి పర్యవేక్షించారు. విజేతలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఉన్నత పాఠశాల పీడీ జ్యోతి పాల్గొన్నారు.

## నిర్మాణాల్లో నాణ్యత ముఖ్యం: డీఆర్ఎం బొహ్రా



ఇంజనీర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ ప్రధాన కార్యాలయంలోని డీఆర్ఎం సమావేశ మందిరంలో శుక్రవారం వినియోగదారులు, ఇంజనీర్లతో అమృత్ సంవాద్ కార్యక్రమం జరిగింది. డీఆర్ఎం లలిత్ బొహ్రా పాల్గొని మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులు, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేపట్టిన నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. అమృత భారత్ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయడంలో ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు భాగస్వాములు కావాలన్నారు. రైల్వే కార్యకలాపాలు సురక్షితంగా సాగడానికి భద్రతా నిబంధనలు పాటించడం, ప్రమాణాలను అమలు చేయడం ముఖ్యమని పేర్కొన్నారు. ప్రాజెక్టుల నిర్మాణ పనులకు సంబంధించి వివిధ అంశాలపై ఇంజనీర్లు, వినియోగదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (కో-ఆర్డినేషన్) ఎ.కె.మెహరానా పాల్గొన్నారు.

## దీపాల తయారీలో శిక్షణ



దీపాల తయారీలో శిక్షణ పొందుతున్న దివ్యాంగ బాలలు

అక్కయ్యపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో దివ్యాంగ బాలలకు శుక్రవారం మట్టి మోడలింగ్, దీపాల తయారీలో శిక్షణ ఇచ్చారు. ప్రజ్వలవాణి వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకురాలు సుచిత్ర మాట్లాడుతూ దివ్యాంగ బాలల జీవనోపాధి కి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. వృత్తిపరమైన శిక్షణ, సృజనాత్మక నైపుణ్య అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. మట్టితో దీపాల డిజైన్‌లను తయారు చేసి, వాటిని ఎరుపు, ఆకుపచ్చ, నీలం రంగులతో అలంకరిస్తారన్నారు. తయారైన దీపాలను కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

## 'దుర్గానగర్‌లో యథేచ్ఛగా చట్ట ఉల్లంఘనలు'



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ, పీతల మూర్తియాదవ్

సీతంపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట దుర్గానగర్‌లో పేలుళ్ల (బ్లాస్టింగ్) మూలంగా పౌరుల ప్రాథమిక హక్కులు, భద్రతా చట్టాల ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతోందని, ఆ గ్రామానికి కేవలం 50 మీటర్ల దూరంలో భారీ పేలుళ్లు నిరంతరం జరుగుతున్నాయని జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు. పేలుళ్ల కారణంగా ఇళ్లకు భారీ నష్టాలు, ప్రజలకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. శుక్రవారం ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తహసీల్దార్, కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి, రాష్ట్ర కార్యదర్శులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఈ ప్రమాదకర కార్యకలాపాలు నిలిపివేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. చట్టాలు, పర్యావరణ నియమాలు, భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు (ఆర్టికల్ 14, 19, 21) కూడా ఉల్లంఘిస్తున్నాయన్నారు. ఇక్కడి ప్రజలు ప్రశాంత జీవితం కోల్పోయారన్నారు. నివాస ప్రాంతాల నుంచి కనీసం 500 మీటర్ల దూరంలోనే పేలుళ్లు జరపాలని నిబంధనలు చెబుతున్నా, పాటించడం లేదన్నారు. 500 మీటర్ల పరిధిలోని అన్ని బ్లాస్టింగ్‌లను వెంటనే నిలిపివేయాలని, కలెక్టర్, ఆంధ్రప్రదేశ్ పర్యావరణ నియంత్రణ మండలి తక్షణమే విచారణ జరపాలని, చట్ట ఉల్లంఘనలకు పాల్పడ్డ కాంట్రాక్టర్లు, అధికారులు, పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని దుర్గానగర్ ప్రజల తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ పాల్గొన్నారు.

## ఖాళీ జాగా కనిపిస్తే చాలు... పార్కింగే!



ఎంఈవో కార్యాలయం ఎదుట పార్కింగ్ చేసిన కారు

అక్కయ్యపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయం (ఎంఈవో) ఎదుట వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల ఆ కార్యాలయానికి విచ్చేస్తున్న ఉద్యోగులకు అసౌకర్యంగా ఉంటోంది. రోజూ ఇదే తంతుగా కార్యాలయం ఎదుట వాహనాలను ఇష్టానుసారంగా నిలుపుతున్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసేందుకు పుస్తకాలను తీసుకొచ్చే వాహనాలను కార్యాలయం ఎదుట నిలిపివేయడానికి అవకాశం కుదరడం లేదని ఉద్యోగులు చెబుతున్నారు. రాత్రి సమయంలో కార్లు పార్కింగ్ చేసి మరుసటి రోజు ఎప్పుడు తీస్తారో ఎవరికీ అర్థం కావడం లేదని, ఒక్కోసారి రోజుల తరబడి కార్లు తీయకుండా అక్కడే వదిలేస్తున్నారు. కార్యాలయం ఎదుట పార్కింగ్ చేయరాదని ఎవరైనా చెబితే వారితో వాహనాల యజమానులు తగాదా పడుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు స్పందించి ఎంఈవో కార్యాలయం ఎదుట పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మంత్రి లోకేశ్ రాక రేపు

... 5వ పేజీ తరువాయి

వస్తున్నారు. మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో భాగంగా పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే మ్యాచ్‌ను తిలకిస్తారు. అదేరోజు కైలాసగిరిపై వీఎంఆర్డీఏ నిర్మించిన గ్లాస్ బ్రిడ్జిని ప్రారంభిస్తారు. ప్రముఖ ఐటీ సంస్థ సిఫీ టెక్నాలజీస్‌కు ఓజోన్‌వేలీలో కేటాయించిన స్థలంలో భూమి పూజ చేస్తారని తెలిసింది. వీటితో మరిన్ని కార్యక్రమాలు ఉన్నాయని, ఖరారు కావలసి ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

## విశాఖకు పెట్టుబడుల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

అండ్ రిసార్ట్ ఏర్పాటు చేసి రూ.55.84 కోట్లతో 98 మందికి ఉద్యోగాలిస్తుంది.

- వరుణ్ బీచ్ సంస్థ బీచ్‌రోడ్డులో పునర్నిర్మించే ప్రాజెక్టుకు పర్యాటక శాఖ నుంచి రాయితీలు ఇవ్వాలని తీర్మానించారు.
- విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామని హామీ ఇచ్చిన రూ.2,400 కోట్లను విద్యుత్ బిల్లుల రూపేణా సమకూర్చాలని తీర్మానించారు. ఇప్పటివరకూ రూ.753.29 కోట్ల విద్యుత్ బకాయిలు ఆర్ఐఎన్ఎల్ చెల్లించాల్సి ఉంది. ఈపీడీసీఎల్ రెండేళ్ల పాటు బిల్లులు తీసుకోకుండా ఉండేలా, ఆ మొత్తాన్ని విద్యుత్ సంస్థకు పదేళ్ల తరువాత ప్రిఫరెన్షియల్ షేర్ క్యాపిటల్‌గా మార్చడానికి నిర్ణయించారు.

## కొత్త ఉపాధ్యాయులకు పాఠశాలలు కేటాయింపు

... 5వ పేజీ తరువాయి

పాఠశాలలు కేటాయించారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అన్ని కేటగిరీలు కలిపి 400 మంది అభ్యర్థులకు కౌన్సెలింగ్ పూర్తిచేశారు. పాఠశాలల కేటాయింపునకు సంబంధించి ఉత్తర్వులు అభ్యర్థుల మెయిల్స్‌కు పంపారు. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు ఈనెల 13వ తేదీ (సోమవారం)న విధుల్లో చేరనున్నారు. మెగా డీఎస్సీలో చివరి అంకం శిక్షణ విజయవంతంగా ముగిసిందని, అనంతరం పాఠశాలలు కేటాయింపు పూర్తిచేశామని పాఠశాల విద్యా శాఖ ప్రాంతీయ సంచాలకులు విజయభాస్కర్ తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టనున్న ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలిపారు. విద్యార్థులకు ఉత్తమ బోధన చేసి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కాగా, డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లకు ఈ నెల మూడో తేదీ నుంచి శుక్రవారం వరకూ శిక్షణ ఇచ్చారు.

## కారుణ్య నియామకాలకు కలెక్షన్

... 5వ పేజీ తరువాయి

ఉంటుంది. కాబట్టి అర్హత కలిగిన వారికి ఫోన్ చేసి రూ.1.5 లక్షలు ఇస్తే ఉద్యోగం ఇస్తామని ప్రలోభపెడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఎవరైనా అంతమొత్తం ఇచ్చుకోలేమంటే రూ.50 వేలు కనీస మొత్తంగా చెల్లించాలని అడిగారు. అదే వర్క్ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు అయితే రూ.లక్ష వరకు డిమాండ్ చేసినట్టు సమాచారం. కారుణ్య కోటాలో ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న ఒక మహిళా అభ్యర్థినితో సదరు ఉద్యోగి లంచం గురించి మాట్లాడినప్పుడు ఆమె రికార్డింగ్ చేసి తనకు తెలిసిన వారికి పంపించారు. దీంతో 'కారుణ్య కోటా'లో ఉద్యోగాల భర్తీ కోసం వసూళ్లపర్వం బయటకు వచ్చింది. వసూళ్ల తతంగం దాదాపు పూర్తి కావడంతో వారి ఫైల్‌ను త్వరలోనే కమిషనర్‌కు పంపించాలని సూత్రధారి అయిన అధికారి యోచిస్తున్నట్టు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై కమిషనర్ కేతన్‌గార్గ్ దృష్టిసారించాల్సి ఉంది.

## 2047 నాటికి 50 శాతం పచ్చదనం

... 5వ పేజీ తరువాయి

చేస్తామన్నారు. నగర వనాల్లో వాకింగ్, యోగా, ధ్యానం చేసుకునేందుకు సదుపాయాలు కల్పిస్తామన్నారు. అడవిలో ఉన్నామనే భావన వచ్చేలా ఏర్పాట్లుచేస్తామన్నారు. అలాగే ఎకో టూరిజాన్ని ప్రోత్సహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అరకులోయ, అనంతగిరి, లంబసింగి, వంజంగి తదితర ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. వచ్చే నెల నుంచి సముద్రతీర ప్రాంతాలకు తాబేళ్ల రాక ప్రారంభమవుతుందని కన్జర్వేటర్ పేర్కొన్నారు. గత సీజన్‌లో మూడు లక్షల తాబేళ్ల గుడ్ల రక్షణకు కేంద్రాలు ఏర్పాటుచేశామని, వాటి నుంచి 80 శాతం పిల్లలు బయటకు రాగా సముద్రంలో విడిచిపెట్టామన్నారు. తాబేళ్ల రక్షణకు నెస్టింగ్ కేంద్రాల ఏర్పాటు, ప్రజలకు చైతన్యం పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## రౌడీషీటర్ హత్య

... 5వ పేజీ తరువాయి

మరింత లోతుగా విచారించగా..మృతదేహాన్ని ఎలమంచిలి సమీపంలో పడేసినట్టు చెప్పాడు. దీంతో గురువారం సాయంత్రం ఎలమంచిలి వెళ్లి, స్థానిక పోలీసుల సహాయంతో మృతదేహం ఉన్న ప్రదేశానికి వెళ్లారు. మృతదేహం బాగా ఉబ్బిపోయి దుర్వాసన వస్తున్నది. శ్రీధర్‌బాబు మృతిగురించి విజయవాడలో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం ఉదయం పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి వివరాలు సేకరించారు. ఈలోగా మృతుడి తల్లి, భార్య, పిల్లలు ఎలమంచిలి చేరుకున్నారు. శ్రీధర్‌బాబు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. గౌరీశంకర్‌ను అదుపులోకి తీసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్టు ఎంవీపీ సీఐ ప్రసాద్ తెలిపారు.

## ప్రత్యామ్నాయం... దైవాధీనం!

... 5వ పేజీ తరువాయి

దేవదాయ శాఖ అధికారులు వందలాది ఎకరాలు అప్పగించారు. ప్రతిఫలం సాధించడంలో చొరవ చూపడం లేదు.

**దేవస్థానం రికార్డుల ప్రకారం వివిధ సంస్థలకు కేటాయించిన భూముల వివరాలివి**

1. 1972, 1985: ఎన్ఎస్‌టీఎల్, డిఫెన్స్ క్వార్టర్స్‌కు 37.75 ఎకరాలు
2. 1979లో మైక్రోవేవ్ రిపీటర్ స్టేషన్ (ఎస్ఈ రైల్వే)కు 33.41 ఎకరాలు
3. 1982లో ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (వేపగుంట)కు 144.75 ఎకరాలు
4. 1986లో బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలకు 45.32 ఎకరాలు
5. తాజాగా రైడెన్ డేటా సెంటర్‌కు 100 ఎకరాలు

వీటితోపాటు నీటి పారుదల శాఖ కార్యాలయం, రిజర్వాయర్ నిర్మాణానికి, పబ్లిక్ హెల్త్ శాఖ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సీతమ్మధారలో వీకర్ సెక్షన్, వెంకోజీపాలెంలో ఎస్సీ కాలనీ నిర్మాణానికి, కేంద్ర ప్రభుత్వానికి చెందిన టీవీ స్టేషన్, టవర్ ఏర్పాటుకు, వెంకోజీపాలెం నుంచి హనుమంతవాక వరకు హైవే విస్తరణకు, వేపగుంట పంచాయతీ ప్రహ్లాదపురంలో వెనుకబడిన ఇళ్ల కాలనీ నిర్మాణానికి ప్రభుత్వాలు గతంలో సుమారు 284 ఎకరాలు కేటాయించాయి. ఏపీఎస్ ఆర్టీసీకి సర్వే నంబర్లు 197, 198లో సింహాచలం డిపో నిర్మాణానికి 5.3 ఎకరాలు కేటాయించారు. దేవస్థానానికి ఆర్టీసీ రూ.10 లక్షలు చెల్లించింది. ఇప్పటివరకు దేవస్థానం ఖాతాకు జమ అయిన మొత్తం ఇదే. తాజాగా రైడెన్ డేటా సెంటర్‌కు అడివివరం సర్వేనంబరు 275లో 100 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించినట్టు సమాచారం. ప్రత్యామ్నాయ భూములు సాధించడం లేదా దేవస్థానం ఖజానాకు భూముల మార్కెట్ విలువ చేరేలా చర్యలు తీసుకోవడంపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించాలని భక్తులు కోరుతున్నారు.

## శ్రీవారికి ప్రత్యేక అభిషేకాలు


స్వామి వారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

పెందుర్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):స్థానిక వెంకటాద్రిపై కొలువైన వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న చాతుర్మాస్య దీక్ష సందర్భంగా శుక్రవారం స్వామివారి విగ్రహానికి పంచామృతాభిషేకా లు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని వేకువజామునే మేల్కొలిపి తోమాల సేవ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా అన్న సమారాధన

మల్కాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం రెండు గుడుల వద్ద దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా టెంపుల్స్ ఫ్రెండ్స్ శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్ ప్రారంభించారు. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## 'ఐద్వా సభలను జయప్రదం చేయండి'

మల్కాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13, 14, 15 తేదీలలో అనంతపురంలో జరగనున్న ఐద్వా 16వ మహాసభకు ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని రాష్ట్ర కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో ఐద్వా పతాకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై అరాచకాలు బాగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమలో ఏరియా కమిటీ కార్యదర్శి బూడి జ్యోతి, రమ్య, సత్యవతి, పూడమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమాంబకు పూజలు


ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ

అగనంపూడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర ప్రాంతాల భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణ, విష్ణుసహస్ర నామ పారాయణాన్ని నిర్వహించారు. అనంతరం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా భక్తులకు ఆలయ ఆవరణలో యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ**: శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 27, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 30, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 32, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 52, దొండకాయలు 32, బంగాళదుంపలు 20 అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 72, బరబాటి 42, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి (పెదవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 26, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 36, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికా య 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 100, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

**కోడిగుడ్లు (నెక్)**

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 515 |
| విజయనగరం | 519 |
| శ్రీకాకుళం | 519 |

**చికెన్ ధరలు**

బ్యాగ్

| | |
|---|---|
| రైతు ధర | 125 |
| లైవ్ ధర | 145 |
| విత్ స్కిన్ | 260 |
| స్కిన్‌లెస్ | 270 |

# విద్యార్థులకు మానసిక ప్రశాంతత ముఖ్యం


కణితి హైస్కూల్‌లో విద్యార్థులతో మ్యాజిక్ బస్ సిబ్బంది



సైకాలజిస్ట్ మాధవి గణపతిని సత్కరిస్తున్న విజ్ఞాన్ ప్రిన్సిపాల్ సుధాకర్

- ప్రముఖ సైకాలజిస్ట్ మాధవి గణపతి
- అధికంగా ఆలోచించి డిప్రెషన్‌కు గురికావద్దని సూచన
- పలు విద్యా సంస్థల్లో మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహణ

అగనంపూడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేగవంతమైన జీవన శైలిలో విద్యార్థులు మానసిక ప్రశాంతతను కాపాడుకోవడం ఎంతో అవసరమని ప్రముఖ సామాజిక కార్యకర్త, సైకాలజిస్ట్ మాధవి గణ పతి అన్నారు. మానసిక దినోత్సవాన్ని పురస్కరించుకుని దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో 'మానసిక ఆరోగ్యం ఒత్తిడి నియంత్రణ' అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంటలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ మధు సూదనరావు అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే 85వ వార్డు అండమాన్ కొండయ్యవలసలో శ్రేయ సేవాసద న్‌లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉక్కు విశ్రాంతి ఉద్యోగి ఉమామహేశ్వరరావు ఆర్థిక సాయంతో విద్యార్థులకు టీషర్ట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత వార్డు అధ్యక్షుడు బండారు చందూ రమేశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**కణితి హైస్కూల్‌లో**

కూర్మన్నపాలెం (ఆంధ్రజ్యోతి): మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని కణితి పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి బాబీ అన్నారు. 87వ వార్డు కణితి హైస్కూల్‌లో శుక్రవారం మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ విషయాన్ని అధికంగా ఆలోచించి డిప్రెషన్‌కు గురి కావద్దని, ప్రతి విషయాన్ని తల్లిదండ్రులతో, మిత్రులతో పంచుకోవాలన్నారు. హెచ్‌ఎం నరసింగరావు మాట్లాడుతూ ఆందోళన, మద్యపానం, ఆన్‌లైన్ గేమ్స్ మాదకద్రవ్యాల జోలికి వెళ్లినవారు ఇటువంటి దీర్ఘకాలిక రోగాల బారిన పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరావు, , శ్రీనివాస్, అప్పారావు, సంస్థ మానిటరింగ్ అధికారి సురేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## దువ్వాడ రైల్వే స్టేషన్‌లో అభిప్రాయ సేకరణ


సమావేశంలో మాట్లాడుతున్న వాల్తేర్ ఏఆర్‌ఎం ప్రణవ్ జెట్లీ

కూర్మన్నపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణీకుల సౌకర్యాలను మెరుగుపరచటానికి అమృత్ సంవాద్ 5.0 ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాల్తేరు ఏఆర్‌ఎం ప్రణవ్ జెట్లీ పాల్గొని, అమృత్ సంవాద్ రైల్వే సెంటర్ నేషనల్ గోల్డ్ జర్నీ దువ్వాడ రైల్వే సేషన్ వీఐపీ లాంచ్‌లో ప్రయాణికులు, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రజాభిప్రాయ సేకరణను చేపట్టారు. అమృత భరత్ పథకం కింద స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పను లకు పరిశీలించి, తగు సూచనలు, సలహాలు అందించారు. నగరంలో దువ్వాడ రైల్వే స్టేషన్ భవిష్యత్తులో రూపు దిద్దుకోనున్న విధానాలను, రానున్న భవిష్యత్తు ప్రణాళికను, నూతన వసతుల కల్పనను వివరించారు. దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్టేషన్‌లో ఎస్కలేటర్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్‌కు షెడ్లు, పాలిథిన్ నివారణకు ఏర్పాట్లు, ఫుడ్ స్టాళ్లు, వీల్ చైర్లు, బ్యాటరీ కార్లు, ఇంటర్‌నెట్ కనెక్షన్ ప్లాట్‌ఫామ్‌ల పెంపు, శ్రీకాకుళం, రాజమండ్రి, కాకినాడ, విశాఖకు షటిల్ సర్వీసులు నడపాలని తదితర సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. స్పందించిన ప్రణవ్ జెట్లీ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి స్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్‌ఆర్‌సీసీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ సభ్యులు, రైల్వే అధికారులు రవి కిరణ్, సురేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## 'కోటి సంతకాలు సేకరణ' పోస్టర్ ఆవిష్కరణ

పెదగంట్యాడ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ చేపట్టిన కోటి సంతకాలు సేకరణకు సంబంధించిన పోస్టర్‌ను వైసీపీ నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శనివారం నుంచి ప్రతి కాలనీలోను సంతకాల సేకరణ చేయాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గం సమన్వయకర్త తిప్పల శ్రీనివాసదేవన్‌రెడ్డి, నియోజకవర్గం పరిశీలకులు తైనాల విజయకుమార్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా చినతల్లి, వైఎస్‌ఆర్‌టీయూసీ అధ్యక్షుడు పిట్టారెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

మల్కాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఎరువుల కర్మాగారం సహకారంతో గోపాలపట్నం ఎమ్మెల్యే పి.గణబాబు విజ్ఞప్తి మేరకు 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి వార్డు జనసేన అధ్యక్షుడు పుర్రె సురేశ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరమాండల్ ఎరువుల కర్మాగారం పారిశ్రామిక ప్రాంతంలో అనేక సేవలు అందిస్తోందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి రూ.8 లక్షలు వెచ్చిస్తున్నట్టు తెలిపారు. ఈ కేంద్రం నిర్మాణానికి కోరమాండల్ సంస్థ నిధులు కేటాయించడంలో ఎమ్మెల్యే గణబాబు ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ కంపెనీ సీఎస్‌ఆర్ ప్రతినిధి శేషవు వెంకటరమణ, మహిళ ప్రతినిధులు, బీజేపీ మండల అధ్యక్ష ఉడు రామకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## 87వ వార్డులో పాము కలకలం


పామును పట్టుకున్న కిరణ్

కూర్మన్నపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు ముస్లిం వీధిలో శుక్రవారం పాము హల్‌చల్ చేసింది. ఈ విషయం వార్డు కార్పొరేటర్ బొండా జగన్ దృష్టికి వెళ్లడంతో, మింది ప్రాంతానికి చెందిన పాములను పట్టే రొక్కం కిరణ్ కుమార్‌కు సమాచారం అందించి పిలిపించారు. కిరణ్ ఘటనా స్థలానికి చేరుకుని పామును పట్టుకున్నాడు. దానిని సురక్షిత ప్రాతంలో విడిచి పెడతానని అన్నారు. ఈ పాము చూడటానికి కింగ్ కోబ్రాను పోలి ఉన్నదని కిరణ్ పేర్కొన్నారు.

## రోలర్ స్కేటింగ్‌కు ఎంపికైన విద్యార్థులకు అభినందన


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో పెంటిరాజు

పెదగంట్యాడ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా రోలర్ స్కేటింగ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన రోలర్ స్కేటింగ్ పోటీల్లో పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన పలువురు విద్యార్థులు పలు విభాగాల్లో విజేతలుగా నిలిచి, వచ్చే నెల కాకినాడలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రగ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్ల పెంటిరాజు వీరిని శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు తగిన సాయం అందిస్తామని ప్రకటించారు. రోలర్‌స్కేటింగ్ కోచ్ సంగం మురళీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## క్రేన్ ఓనర్స్ సంక్షేమమే వీహెచ్‌సీవోఏ ధ్యేయం

- క్రేన్ ఓనర్స్ అసోసియేషన్ చైర్మన్ పూసపాటి రాజేశ్



పూసపాటి రాజేశ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న దృశ్యం

పెందుర్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ జిల్లాలో ఉన్న హెవీ క్రేన్స్ యజమానులు వీహెచ్‌సీవోఏ సంస్థలో చేరితే పరిశ్రమ వృద్ధి, సంక్షేమం కోసం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తామని వీహెచ్‌సీవోఏ చైర్మన్ పూసపాటి రాజేశ్ పేర్కొన్నారు. పెందుర్తి మండలం ఎస్‌ఆర్‌పురంలో ఓ అతిథి గృహంలో శుక్రవారం విశాఖ హెవీ క్రేన్స్ ఓనర్స్ అసోసియేషన్ (వీహెచ్‌సీవోఏ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ పూసపాటి రాజేశ్ మాట్లాడుతూ వీహెచ్‌సీవోఏ ఆల్ ఇండియా క్రేయిన్స్ అసోసియేషన్‌తో సంబంధాలు మెరుగవుతాయని, క్రేన్ల నిర్వహణ పనులకు సంబంధి ంచి కంపెనీలు, క్లయింట్ల నుంచి చెల్లింపులు పెండింగ్‌లకు అడ్డంకులు వస్తే తక్షణ పరిష్కారానికి సంస్థ భరోసా ఇస్తుందని తెలిపారు. విశాఖ చాంబర్స్‌తో కలసి నగరంలో విపత్తు, నిర్వహణ తుపాను సంక్షోభం పరిస్థితుల్లో జిల్లా అధికార యంత్రాంగానికి సంఘీభావంగా సాయం చేసేందుకు వీహెచ్‌సీవోఏ కట్టుబడి ఉంటుందన్నారు. సంఘం అధ్యక్షుడు లీలా రామవరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గల క్రేన్ల యజమానుల బలమైన నెట్‌వర్క్ నిర్మించడమే వీహెచ్‌సీవోఏ లక్ష్యం అన్నారు. అనంతరం వీహెచ్‌సీవోఏ అజెండా ఆదాయ, వ్యయ నివేదికను సమావేశంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్, సంఘ కార్యదర్శి మహంతి చంద్ర శేఖర్, జాయింట్ సెక్రటరీ సీహెచ్ సుబ్రహ్మణ్యం, కోటేశ్వరరావు, అడ్వైజర్స్ శంకర్ నారాయణ, రవికుమార్, ఆర్గనైజర్స్ ఎల్ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'పెన్షనర్ల సమస్యలపై పోరాటాలు'


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కే హుస్సేన్

మల్కాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పెన్షన్‌దారులకు న్యాయం జరుగుతుందని, ఆ దిశలోనే పోరాటాలు సాగుతున్నాయని పెన్షనర్ల సంఘం ముఖ్య ప్రతినిధి ఎస్‌కే హుస్సేన్ పేర్కొన్నారు. స్థానిక వెంకన్నపాలెంలో సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పెన్షన్‌దారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా 16వ తేదీన పెన్షదారులందరూ విద్రోమ దినం పాటిస్తున్నారని అయితే ఈ సారి నవంబర్ 16వ తేదీ ఆదివారం పడినందున ఆ కార్యక్రమం ఎప్పుడు నిర్వహించేది రాష్ట్ర కమిటీతో చర్చించి తేదీ ప్రకటిస్తామని చెప్పారు. ఈనెల 13న ఢిల్లీలో పెన్షన్‌దారుల సమావేశం ఉందని, ఈ సందర్భంగా ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం సోషల్ మీడియా, కొన్ని పత్రికల్లో మినిమం రూ.2500 పెన్షన్ అని ప్రచారంలో ఉందని అయితే ఇప్పటి వరకు అధికారికంగా ఎటువంటి ఉత్తర్వులు రాలేదని ఎవరూ ఆందోళన చెందవల్సిన అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

## సాంకేతిక రంగంలో రాణించండి

- డీఆర్‌డీవో శాస్త్రవేత్త మురళీధర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శాస్త్రవేత్త మురళీధర్

అగనంపూడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా విద్యార్థులు రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు లభిస్తోందని డీఆర్‌డీవో శాస్త్రవేత్త ఎస్. మురళీధర్ పేర్కొన్నారు. విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులు పాటు ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి మహిళా టెక్నికల్ ఫెస్టివల్‌ను (టెక్రిడ్జ్ 2కె25) శక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు ఎంత ముఖ్యమో సృజనాత్మకమైన ఆలోచలనలు, న్యాయకత్వ లక్షణాలు అంతే ముఖ్యమని సూచించారు. విజ్ఞాన్ విద్యా సంస్థలు ఏటా టెక్రిడ్జ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తూ విద్యార్థుల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతోందన్నారు. అనంతరం డీజీవర్క్ మీడియా వ్యవస్థాపకురాలు శృతి సాహ్ని మాట్లాడుతూ పర్యావరణహితమైన ఆవిష్కరణల్లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెరిగేందుకు ఏటా టెక్నికల్ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ అరుంధతి తెలిపారు.

## వైభవంగా పంచముఖేశ్వర శివాలయం ఉత్సవాలు


శివలింగాలకు పూజలు చేస్తున్న అర్చకులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు కణితి కాళింగుల వీదిలో వేంచేసిన శ్రీ కార్తికేయ, శ్రీ స్వర్ణాకర్షణ భైరవ, శ్రీ భువనేశ్వరి దేవి సహిత శ్రీ పంచముఖేశ్వర స్వామి సాంగ నూతన దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉత్తరాంధ్రలో ఎక్కడా లేని విధంగా 42 అడుగులు ఏకశిలా ధ్వజ స్థంబం ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో భాగంగా విగ్రహాల తిరువీధి, నవగ్రహ సహిత రుద్ర మండల మండప ఆవాహములు, అర్చనలు, అగ్ని ప్రతిష్ఠాపన, సామూహిక కుంకుమ పూజలు, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్లా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ బొండా జగన్ పాల్గొన్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి సత్కరించారు.


కార్యక్రమంలో పాల్గొన్న నాయకులతో ప్రసాదుల శ్రీనివాస్

## సీఎం చంద్రబాబు విజన్ ఉన్న లీడర్

- గాజువాక టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడని, నేటి యువతకు బంగారు భవిష్యత్తు అందించాలనే ఆలోచన ఉన్న వ్యక్తి అని ఏపీఐఐసీ డైరెక్టర్, గాజువాక టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు హైదరాబాద్ ఇంత అభివృద్ధి సాధించిందంటే నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన కృషి అని పేర్కొన్నారు. ఎంతో మంది నాయకులు వస్తారు గానీ, చంద్రబాబు నాయుడు లాంటి మహోన్నత వ్యక్తి రారని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వ్యక్తి చంద్రబాబు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తమిరె శివప్రసాద్, సత్యారావు, ప్రభావతి, సన్యాసమ్మ, భాస్కరరావు, వెంకటేశ్వరరావు, శ్వేతకుమారి తదితరులు పాల్గొన్నారు.

## రేకులు ఊడిపోయిన ఎన్‌ఏడీ బస్టాప్


ఎన్‌ఏడీ వద్ద రేకులు ఊడిన బస్‌షెల్టర్

ఎన్.ఎ.డి.జంక్షన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు ఎన్‌ఏడీ దగ్గర గోపాలపట్నం బస్టాప్‌కు రేకులు ఊడిపోయి కళావిహీనంగా ఉంది. వీఎమ్‌ఆర్‌డీఏ అధికారులు ఎంతో మోడల్‌గా తీర్చిదిద్దిన ఈ బస్‌స్టాప్‌లో ఉన్న రేకులను కొందరు ఆకతాయిలు అమ్మేసుకున్నట్టు సమాచారం. ఈ ప్రాంతంలో రాత్రి సమయంలో జూదగాళ్లకు అడ్డాగా ఉండడంతో ఈ విధంగా జరిగుంటుందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ బస్‌స్టాప్ ఇలా తయారవడానికి పర్యవేక్షణలోపమే కారణమని తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్‌షెల్టర్‌కు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

## జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఆర్థిక ప్రయోజనం

- జీవీఎంసీ 75వ వార్డు సచివాలయ సిబ్బంది


జీఎస్టీపై ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు, సచివాలయం ఉద్యోగులు

పెదగంట్యాడ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గిస్తూ కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ప్రజలక ఆర్థిక లాభం కలుగుతుందని 75వ వార్డు సచివాలయ సిబ్బంది, తెలుగుదేశం నాయకులు శుక్రవారం నిర్వాసిత కాలనీల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసరాలు, గృహవినియోగ వస్తువులు, కిరాణాసామగ్రి, ఆరోగ్యం, జీవితబీమా, వస్త్రాలు, మందులు, స్టేషనరీ వంటి వాటిపై జీఎస్టీ తగ్గించడం వల్ల అన్ని వర్గాల వారికి డబ్బు ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, 75వ వార్డు టీడీపీ కార్యదర్శి ములకలపల్లి పెంటయ్య, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## అవయవదానంపై అవగాహన సదస్సు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అవయవదానం చేయడవం వల్ల మరణించినా జీవించి ఉంటామని అఖిల భారత అవయవ దాత సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. స్టీల్‌ప్లాంట్ సీ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పలు విషయాలను వివరించారు. ఈ సందర్భంగా 'అవయవ దానం ఎందుకు చేయాలి, మెడికల్ కళాశాలలో బాడీ డొనేషన్ ఎలా ఉపయోగపడుతుంది' అనే అంశాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా బ్రెయిన్ డెడ్ అయిన తరువాత ఆర్గాన్ డొనేషన్ చేస్తే అవి ఎలా ఉపయోగపడతాయో వివరించారు. ఈ సందర్భంగా 25 మంది అవయవదానం, మరో 5 మంది నేత్రదానం చేసేందుకు ముందుక వచ్చి అంగీకారం తెలిపారు. స్పందన చేయూత ఫౌండేషన్, ఉక్కు అధికారుల సంఘం, లయన్స్‌క్లబ్, మానస వికాస వేదిక, మానవత ట్రస్టు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, సర్వహిత ట్రస్టుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రతినిధలు జ్యోతి, విజయలక్ష్మి, ఎంఎస్ఎన్.మూర్తి, ఈపూరి బుచ్చిరాజు, రామ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన హైస్కూల్ విద్యార్థులు


రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

గోపాలపట్నం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు స్థానిక హెచ్‌సీ వెంకటాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు మాట్లాడతూ ఈనెల 4న స్థానిక జడ్పీ హైస్కూల్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన జిల్లా స్థాయి జూడో పోటీల్లో పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. ఈ పోటీల్లో అండర్-14 విభాగంలో జి.వికాస్, అండర్-17 విభాగంలో వి.యశ్వంత్, ఎం.నవీన్, ఎస్.ఛాందిని, పి.హేమంత్ కుమార్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

## దొంగ ఓట్లు నిరోధించాలని సంతకాల సేకరణ


సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెందుర్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో దొంగఓట్ల ప్రభావం అధికమవుతోందని, దీన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ నిరోధించాలని ఆకా ంక్షిస్తూ పెందుర్తిలో కాంగ్రెస్ శ్రేణులు సంతకా సేకరణ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న మాట్లాడతూ దొంగ ఓట్ల ప్రభావంతో ప్రజాస్వామ్యం కుదేలవుతోందన్నారు. అనంతరం కన్వీనర్ విన్నకోట రాము పలువురి నుంచి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## నగరంలో అనసూయ సందడి

మహారాణిపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సినీనటి అనసూయ శుక్రవారం నగరంలో సందడి చేసింది ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆమె అభిమానులతో ముచ్చటించి, వారితో ఫొటోలు తీసుకున్నారు. ఈ సందర్భంగా తాను నటిస్తున్న సినిమాలు, టీవీ షోల గురించి వారికి వివరించారు.

## 13న ఐటీఐ అప్రంటిస్ మేళా

కంచరపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నరవ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 13న నేషనల్ అప్రంటిస్ మేళాను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాలో డాల్ఫిన్స్ హోటల్స్, జయభేరి ఆటోమోటివ్ లిమిటెడ్, వీర రాఘవులు కనస్ట్రక్షన్స్, ఆర్‌సీఎల్, యునైటెడ్ హార్డ్‌వేర్, సంపత్ హైడ్రో టెక్నాలజీస్ తదితర సంస్థలు పాల్గొంటాయన్నారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలు, నకళ్లు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, బయోడేటాతో ఉదయం 9గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9398785720 నంబరులో సంప్రదించాలన్నారు.

## నేడు జస్టిస్ రామస్వామి స్మారకోపన్యాసం

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం బీఆర్ అంబేడ్కర్ న్యాయకళాశాలలో శనివారం జస్టిస్ రామస్వామి స్మారకోపన్యాసం ఏర్పాటు చేశారు. ఉదయం పది గంటలకు దివంగత జస్టిస్ కె.రామస్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ ముఖ్య అతిథిగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.



# భీమిలికి నూతన సొబగులు

## రూ.21 లక్షలతో కూడళ్ల అభివృద్ధి

### ఉత్సవ్ సందర్భంగా సుందరంగా ముస్తాబు

భీమునిపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): భీమునిపట్నంలో జంక్షన్‌లను అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బీచ్‌రోడ్డు గోస్తనీ సాగర సంగమానికి ప్రవేశమార్గం వద్ద స్వాగతం పలుకుతున్న పైలాన్‌ను, దానిని అనుకుని ఉన్న వాటర్ ఫౌంటైన్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి రు.9 లక్షలు కేటాయించింది. ఈ నిధులతో ఫౌంటైన్ పార్కులో వాటర్ ప్రూఫ్ టైల్స్‌తో పాటు, ఇంటర్ లాకింగ్ బ్రిక్స్‌తో అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటివరకూ ఫౌంటైన్ అడుగుభాగాన నీరు భూమిలో ఇంకిపోతుండడంతో నిర్వహణలో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొనే వారు. భవిష్యత్తులో నీరు ఇంకకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఫౌంటైన్ కొత్తగా ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి సమయంలో సందర్శకులను ఆకట్టుకునేలా విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దనున్నారు. శతాబ్దిన్నర పైలాన్ మరమ్మతులకు గురైంది. దీనికి స్టీల్ రైలింగ్ ఏర్పాటు చేస్తారు. నగరపాలెం జంక్షన్‌ను వినూత్నంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ రూ. 13లక్షలు కేటాయించింది. ఈ నిధులతో నిర్మించిన ట్రాఫిక్ ఐలాండ్‌లో నాటు పడవపై ఇంగ్లీష్ మ్యాన్ చేపను పట్టుకుని ఉన్నట్టు ఏర్పాటు చేశారు. పార్కుకు స్టీల్ రైలింగ్‌తో అందంగా మారుస్తున్నారు. నగరపాలెం నుంచి బోయపాలెం జాతీయ రహదారికి కాపులుప్పాడ మీదుగా రహదారి విస్తరణ పనులు జరిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నగరపాలెం జంక్షన్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నారు. తిమ్మాపురం జంక్షన్ నుంచి తొట్లకొండ జంక్షన్ వరకూ రూ.78.30 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. సెంట్రల్ మీడియన్‌లో జంగిల్ క్లియరెన్స్, గ్రిల్స్ ఏర్పాటు, ఫుట్‌పాత్ పనులు చేపడుతున్నారు. జీవీఎంసీ సాధారణ పనుల్లో భాగంగా కూడళ్ల అభివృద్ధి, పైలాన్ పార్కు, నగరపాలెం జంక్షన్‌లను అభివృద్ధి చేస్తున్నామని భీమిలి జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, పబ్లిక్ వర్క్స్ ఏఈ సురేష్ తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నవంబరు 14 నుంచి జరగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌ను దృష్టిలో ఉంచుకుని తిమ్మాపురం జంక్షన్ నుంచి తొట్లకొండ జంక్షన్ వరకూ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఆయా పనులతో భీమిలి ఉత్సవ్‌కు వచ్చే సందర్శకులు కొత్త అనుభూతిని పొందే అవకాశాలున్నాయి.



నగరపాలెం కూడలిలో సుందరీకరణ పనులు



బీచ్‌రోడ్డులోని పైలాన్ పార్కును అభివృద్ధి చేస్తున్న దృశ్యం

## భారత్, ఆస్ట్రేలియా క్రికెటర్ల ముమ్మర సాధన

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో ఆదివారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరగనున్న మ్యాచ్‌లో తలపడనున్న భారత్, ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్లు శుక్రవారం ముమ్మ ర సాధన చేశారు. కొలంబోలో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో గెలుపొందిన ఆస్ట్రేలియా క్రికెటర్లు గురువారం మధ్యాహ్నం విశాఖ చేరుకుని హోటల్ ఫోర్ పాయింట్‌లో బస చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేశారు. అలిస్సా హీలీ, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, ఎల్లీస్ పెర్రీ, బెత్ మూనీ, అన్నా బెల్ సదర్లాండ్, ఆష్లీ గార్డనర్, తహ్లియా మెక్‌గ్రాత్, జార్జియా వేర్‌హోమ్, కిమ్ గార్త్, అలనా కింగ్, మేగాన్, జార్జియా వోల్, హీథర్ గ్రాహమ్, డార్సీ బ్రౌన్, మోలినెక్స్ పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి భారత్ క్రికెటర్లు సాధన చేశారు. కొందరు హోటల్‌కే పరిమితం కాగా కెప్టెన్ హర్మన్ ప్రీత్‌తోపాటు మరికొందరు నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు.



బ్యాటింగ్, బౌలింగ్ ప్రాక్టీస్‌లో క్రీడాకారిణులు



ఫిట్‌నెస్ ఎక్సర్‌సైజ్‌లు చేస్తున్న భారత మహిళా క్రికెటర్లు



రగ్బీ ఆడుతున్న ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్లు

# 17న ఏయూలో అకడమిక్ కాన్ఫరెన్స్

### ‣ ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాల యం నేవల్ సైన్స్ టెక్నాలజికల్ ల్యాబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్) సహ కారంతో ఈనెల 17న ఎన్ఎస్‌టీఎల్ అకడమిక్ కాన్ఫరెన్స్-2025 నిర్వహించనున్నట్టు ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్ర హం వర్గీస్ తెలిపారు. ఏయూ పాలకమండలి సమా వేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావే శంలో వీసీ రాజశేఖర్‌తో కలిసి బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ ఎస్‌టీఎల్ - అకడమియా సినర్జీ ఫర్ ఇండిజీనియస్ అండ్ సెల్ఫ్ రిల యెంట్ నావల్ టెక్నాలజీస్ అంశంపై బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో సదస్సు నిర్వహిస్తామన్నారు. రక్షణ రంగ పరిశోధనల్లో విశ్వవిద్యాల యాల భాగస్వామ్యం, సహకారం పెంపొందించడమే లక్ష్యమన్నారు. రక్షణ రంగానికి సంబంధించిన పరిశోధనా ప్రాజెక్టులపైన, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సంబంధించిన ఫండింగ్ లభించే అవకాశాలను చర్చిస్తామన్నారు. వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడు తూ ఎన్ఎస్‌టీఎల్ విభిన్న పరిశో ధనా కేంద్రాల నుంచి నిపుణులు సదస్సులో పాల్గొంటారన్నారు. శతాబ్ది ఉత్సవాల సమయంలో ఇటువంటి సాంకేతిక కార్యక్రమం నిర్వహణతో వర్సిటీ ప్రతిష్ఠ ఇనుమడిస్తుందన్నారు. విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు జాతీయ విద్యాసంస్థలు, ఇంజనీరింగ్, సైన్స్ కళాశాలల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బంది పాల్గొనవచ్చన్నారు. ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త టి.వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రారంభ కార్యక్రమం, కీలకోపన్యాసం అనంతరం మొదటి సెషన్‌లో ఎన్ఎస్‌టీలకు సంబంధించిన వివిధ ప్రాజెక్టులపై అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. ఎన్ఆర్‌బీ సెషన్ నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం నుంచి పరిశోధన సమస్యలపై శాస్త్రవేత్తలు, భట్నాగర్ అవార్డు గ్రహీతలు ప్రసంగిస్తారన్నారు. బేసిక్ రీసెర్చ్ ప్రోటోటైప్ తయారీ నుంచి పూర్తిస్థాయిలో సాంకేతికాభివృద్ధిని వాస్తవ రూపంలో తీసుకురావడానికి విభిన్న అంశాలపై నిపుణులు వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



బ్రోచర్ విడుదల చేస్తున్న వీసీ రాజశేఖర్, ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ వర్గీస్, తదితరులు

## హోం స్టే నిర్వాహకులకు అవగాహన

సిరిపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హోం స్టే నిర్వాహకులకు ఏపీ టూరిజం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీ నోడల్ అధికారి ప్రసన్న హాజరై మాట్లాడుతూ హోం స్టే నిర్వహించే వారికి ప్రభుత్వ పరంగా ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. పూర్వ కాలంలో సత్రాలు నిర్వహించినట్టుగానే, ప్రస్తుతం హోం స్టే ఏర్పాటుకు టూరిజం శాఖ ఆధ్వర్యంలో తోడ్పాటు అందిస్తున్నామన్నారు. విశాఖ లాంటి పర్యాటక ప్రాంతంలో వీటి ఏర్పాటు ఉపయోకరంగా ఉంటుందన్నారు. పర్యాటక ప్రాంతంలో అందుబాటులో ఉన్న రెండు నుంచి ఆరు గదుల వరకు ఇందుకోసం వినియోగించుకోవచ్చన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటు చేసే హోం స్టేలకు ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందుతుందన్నారు. విద్యుత్‌రాయితీ కూడా లభిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు హోం స్టే నిర్వాహకుల సందేహాలకు అధికారులు సమాధానమిచ్చారు.



అవగాహన సమావేశానికి హాజరైన హోంస్టే నిర్వాహకులు

## స్పా ముసుగులో వ్యభిచారం

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న దువ్వాడలోని లావిషీ స్పా పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడిచేశారు. మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు తేలడంతో నిర్వాహకులు దువ్వాడ రాజీవ్‌నగర్‌కు చెందిన కిల్లాడ ప్రవీణ్ (28), గరివిడి మండలం దుమ్మెద గ్రామానికి చెందినయెజ్జవరపు దమయంతి (38), గాజువాక కుంచుమాంబకాలనీకి చెందిన కొనసం హైమావతి (30)తోపాటు సహాయకుడు దువ్వాడ రాజీవ్‌నగర్‌కు చెందిన అమిత్‌గౌతమ్ (28), ముగ్గురు విటులను అరెస్టు చేశారు. బాధిత యువతులను పునరావాస కేంద్రానికి తరలించారు.



## మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి

### ‣ ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. ఏయూ సైకాలజీ విభాగంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సింపోజియంను శుక్రవారంఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అనేక మంది మానసిక, ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ సంఘటనలు, సందర్భాలు వ్యక్తులను ప్రభావితం చేస్తాయని, వీటి ఫలితంగా మానసిక అనారోగ్యం ఏర్పడుతుందన్నారు. వీటిని అధిగమించేందుకు అందుబాటులో ఉన్న చికిత్స విధానాలు, సాంకేతికతలను పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. ఏయూ సైకాలజీ విభాగాధిపతి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మరణాలు కేన్సర్, డిప్రెషన్ బారినపడి ఆత్మహత్యలు చేసుకోవడం వల్ల జరుగుతున్నాయన్నారు. దేశంలో కూడా మానసిక సమస్యలు గణనీయంగా పెరుగుతున్నాయని, ఇవి ఎంతో ప్రమాదకరమన్నారు. ఆధిపత్యం కోసం విభిన్న దేశాల మధ్య యుద్ధాలు ప్రజల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. కొవిడ్ సమయంలో మరణాల సంఖ్య పెరగడానికి మానసిక ఆరోగ్యం క్షీణించడమే కారణమని విశ్లేషించారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రాధాకాంత్ మాట్లాడుతూ విపత్తులు, ప్రమాదాల సమయంలో ప్రజలకు సహాయం అందించడం, వారి మానసిక ఆరోగ్యానికి అవసరమైన సాంత్వన చేకూర్చే నిపుణులను తీర్చిదిద్దడం ప్రధానమన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ రామిరెడ్డి, కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ టెక్నాలజీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.అర్జున్, బియాండ్ ఆటిజం వ్యవస్థాపకులు అసిలీనా తదితరులు ప్రసంగించారు.



సింపోజియంను ప్రారంభిస్తున్న వీసీ రాజశేఖర్, తదితరులు

## ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండండి

### ‣ అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశం

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణపై ఆయా శాఖల అధికారులు సిద్ధంగా ఉండి రైతులకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఖరీఫ్ సీజన్‌లో 40 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో పది వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించామన్నారు. కనీస మద్దతు ధర సాధారణ రకం (కామన్ ) క్వింటా రూ.2,369, 'ఏ'గ్రేడ్ క్వింటా రూ.2,389గా నిర్ణయించామన్నారు. గత ఏడాది మద్దతు ధర కన్నా రూ.69 అధికంగా చెల్లిస్తామన్నారు. ధాన్యం విక్రయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా టోల్‌ఫ్రీ నంబరు 1967కు ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఏడుగంటల మధ్య ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలో కంట్రోల్ రూమ్ నంబరు 7702003581 అందుబాటులో ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి, జిల్లా సహకార అధికారి ప్రవీణ, జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్, పౌరసరఫరాల సంస్థ మేనేజరు ఎం.శ్రీలత, అధికారులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని కార్మికుల నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

సిరిపురం, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అరియర్స్ చెల్లించాలని, కార్మికులందరికీ సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. జీవో నంబరు 36 ప్రకారం కార్మికులందరికీ వేతనాలు మంజూరుచేయాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్వహణలో కీలకంగా పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై అధికారులు ఇప్పటికైనా సానుకూలంగా వ్యవహరించి పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్స్ యూనియన్ నాయకులు సతీష్, సింహాచలం, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పగిలిన తాటిపూడి పైప్‌లైన్

పెందుర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయర్ నుంచి నగరానికి నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ శుక్రవారం పగిలిపోయింది. దీంతో భారీగా తాగునీరు వృథాగా పైకి ఎగజిమ్మింది. పెందుర్తి మండలం సరిపల్లి రోటరీ నేత్ర సమీపంలో ఉదయం 11 గంటల సమయంలో పైప్‌లైన్ పగలిపోయింది. దీంతో ఒక్కసారిగా నీరు నీరు నింగికెగసింది. అరకు విశాఖ రహదారి పక్కనే పైప్‌లైన్ ఉండడంతో నీరంతా రోడ్డుపైకి చేరింది. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న జీవీఎంసీ నీటి సరఫరా విభాగం సిబ్బంది అక్కడికి చేరుకుని మరమ్మతులు ప్రారంభించారు. రాత్రికి పనులు పూర్తవుతాయని, నగరానికి తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది ఎదురవకుండా చూస్తామని ఏఈ రాజశేఖర్ తెలిపారు.



పైపు లైన్ నుంచి నీరు ఎగజిమ్ముతున్న దృశ్యం

## చెరువులో పడి వ్యక్తి మృతి

పద్మనాభం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు. మండలంలోని చిన్నాపురం గ్రామానికి చెందిన సొంగ అప్పారావు (69) గురువారం మేకలు కాయడానికి సారికవాని కళ్లాల వైపు వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం సారికవాని చెరువులో అతని మృతదేహం తేలుతూ కనిపించింది. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్టు భార్య ఈశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ జె.సురేష్ కేసు నమోదు చేయగా, ఏఎస్ఐ సీతాపతి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



అప్పారావు మృతదేహం

## 'నా స్థలంలో విగ్రహం తొలగించండి'

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం చినముషిడివాడలో రెండు దశాబ్దాల క్రితం వీఎంఆర్‌డీఏ (అప్పట్లో వుడా) నుంచి కొనుగోలుచేసిన స్థలంలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహం తొలగించాలని చందక శ్రీకృష్ణ శుక్రవారం కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందచేశారు. చినముషివాడ సర్వేనంబరు 164లో వీఎంఆర్‌డీఏ అభివృద్ధి లేఅవుట్‌లో హెచ్‌ఐజీ ప్లాటును 2004లో కొనుగోలుచేశానని, ఈ స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని, ప్రశ్నిస్తే రూ. 25లక్షలు డిమాండ్ చేశారన్నారు. సొమ్ము ఇవ్వడానికి నిరాకరించడంతో తన స్థలంలో అక్రమంగా చొరబడి అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుచేశారని పేర్కొన్నారు. దీనిపై కోర్టులో తనకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. కోర్టు ఆదేశాల మేరకు ఆ స్థలంలో విగ్రహం తొలగింపునకు గురువారం సాయంత్రం పెందుర్తి రెవెన్యూ అధికారులు వెళ్లగా కొందరు అడ్డుకుని దౌర్జన్యం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆక్రమణదారుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించడంతోపాటు కోర్టు ఆదేశాల మేరకు స్థలం అప్పగించాలని శ్రీకృష్ణ కోరారు.

## 18న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 18న నిర్వహించనున్నట్టు కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సంబంధించిన సమాచారాన్ని సభ్యులకు అందజేశామన్నారు. సమావేశంలో చర్చించేందుకు అవసరమైన అంశాలతో అజెండాను తయారుచేస్తున్నామని, త్వరలోనే సభ్యులకు అందజేస్తామన్నారు.

## ఐఅండ్ పీఆర్ డైరెక్టర్ విశ్వనాథన్‌కు అభినందనలు



విశ్వనాథన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సమాచారశాఖ అధికారులు

సిరిపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాచారశాఖ నూతన డైరెక్టర్‌గా నియమితులైన కేఎస్ విశ్వనాథన్‌ను శుక్రవారం జిల్లా సమాచారశాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. జేడీ మణిరామ్, డీడీ సదారావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ఆయనను వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సమాచారశాఖ డైరెక్టర్‌గా ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ సమాచారశాఖ కార్యకలాపాలు, విభాగాలు, అధికారుల హోదాలు తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమష్టిగా, మరింత ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు. డివిజనల్ పీఆర్వో నారాయణరావు, ఏపీఆర్వో నారాయణరావు, ఏవీ సూపర్‌వైజర్ వెంకటరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.